Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 21.03.2014, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 42 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్


వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

• సీమాంధ్ర

# సీన్ మారుతోందా?

• బలం పుంజుకుంటున్న తెలుగుదేశం • ఖాళీ అవుతున్న కాంగ్రెస్ • 'దేశం'లోకి భారీగా వలసలు



**రాష్ట్ర విభజన తరువాత సీమాంధ్ర రాజకీయాలలో అనూహ్యంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఊహించని పరిణామాలతో రాజకీయ స్వరూపమే మారిపోతుంది.**

రాష్ట్ర విభజన జరిగిన తీరు చూసాక సీమాంధ్రలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి తిరుగులేదనుకున్నారు. మొత్తం 175లోక్‌సభ స్థానాలకు గాను 125స్థానాలు వైకాపాకే వస్తాయని భావించారు. అయితే ఆ పరిస్థితులు క్రమక్రమంగా మారుతున్నాయి. ఎన్నికలు ఏకపక్షం కాలేదని వైకాపాకు తెలుగుదేశం నుండి గట్టిపోటీ తప్పదని మారుతున్న రాజకీయ పరిణామాలు చాటిచెబుతున్నాయి.

సీమాంధ్రలో జగన్ బలం తగ్గలేదు. జగన్ ప్రభంజనం, వై.యస్. సానుభూతి అలాగే వుంది. అయితే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి ఇవే పునాది ఓట్లు అవుతాయి. కాంగ్రెస్, తెలుగుదేశంల మాదిరిగా వైయస్సార్ కాంగ్రెస్‌కు సంప్రదాయ ఓటుబ్యాంకు లేదు. కులమత సమీకరణాల వల్లయితేనేమీ, జగన్ ఇమేజ్, వైయస్ ఇమేజ్ వల్లయితేనేమీ వీటివల్ల వచ్చిన ఓట్లే బేస్ ఓట్లవుతాయి.


తెలుగుదేశంకు ఎన్టీఆర్ ఏర్పాటు చేసిన ఓటుబ్యాంకు రక్షణ కవచంగా ఉంటూ వస్తుంది. పార్టీ ఇక్కడ నుండి పెంచుకునే ఓట్లపైనే విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి. సీమాంధ్రలో తెలుగుదేశం అనూహ్యంగా బలపడడానికి ఒక రకంగా కారణం వైకాపానే! జగన్ వైకాపా గేట్లను ఎప్పుడో మూసేసాడు. తనను నమ్మి పార్టీలో చేరినవారిని ముందుగానే సమన్వయకర్తలుగా ప్రకటించేసారు. ఈ కోవలో ద్వితీయశ్రేణి నాయకులు ఎక్కువస్థానాలలో అభ్యర్థులు కాగలిగారు.

ఇదే సమయంలో రాష్ట్ర విభజన ప్రక్రియ చోటు చేసుకుంది. సీమాంధ్రలో కాంగ్రెస్‌పార్టీ మూతపడిపోయే పరిస్థితి వచ్చింది. కాంగ్రెస్ నుండి పోటీచేస్తే ఇళ్లు, ఒళ్లు గుల్లకావడం ఖాయమని నాయకులు నిర్ణయించుకున్నారు. అందుకని కాంగ్రెస్‌ను వదిలి పారిపోవాలనుకున్నారు. అలా పారిపోవాలనుకున్న వారికి తెలుగుదేశం తప్ప మరో రాజకీయ ఆశ్రమం కనిపించలేదు. ఎందుకంటే జగన్ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ గేట్లను మూసేసాడు. (మిగతా 10వ పేజీలో)



**జ**గనన్న ముఖ్యమంత్రి అయితే పేదప్రజల కన్నీళ్లు మటుమాయమవుతాయని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకురాలు, జగన్ సోదరి షర్మిల పేర్కొన్నారు. ఈనెల 17 నుండి 20వతేదీ వరకు షర్మిల జిల్లాలోని ఆత్మకూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు, నెల్లూరు, కావలిలలో మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. బహిరంగసభలు, రోడ్‌షోలలో ఆమె పాల్గొన్నారు. ఆమె సభలకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. 19వ తేదీ నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లో నిర్వహించిన భారీ బహిరంగసభలో ఆమె ప్రసంగించారు. రాష్ట్రాన్ని విడదీసిన (మిగతా 10వ పేజీలో)

# నెల్లూరును చుట్టేసిన జగన్ బాణం



▶ మీడియాకింగ్‌కు, గబ్బర్‌సింగ్‌కు...



# డీల్ కుదిరింది!

***'జనసేన'* అంటూ ఫైవ్‌స్టార్ హోటల్‌లో పార్టీని ఆవిష్కరించి, దాని విధి విధానాలు, జెండా, అజెండా ఏంటో ప్రకటించక ముందే ఢిల్లీలో నరేంద్ర మోడీ ఇంటర్వ్యూ కోసం పడిగాపులు కాసిన పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ వెనుక ఎవరున్నారు? ఆయనను నడిపిస్తున్న శక్తులెవరు? అసలు పవన్ లక్ష్యమేంటి? పవనిజమంటే ఏంటి? దీనిపై అనేక ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.**

చిరంజీవి రాజకీయాల్లోకి రావడం హఠాత్తుగా ఏమీ జరగలేదు. ఆయన రాజకీయ ప్రవేశంపై ఏళ్ల తరబడి ఊహాగానాలు వచ్చాయి. కాని ఈరోజు పవన్ రాజకీయ చర్చ, పార్టీ పెట్టడం అంతా కూడా రోజుల తేడాలో జరిగిపోయింది. పవన్‌ను ఇంత హఠాత్తుగా రాజకీయ తెరపైకి తీసుకురావడం వెనుక రాష్ట్రానికి చెందిన ఓ మీడియా కింగ్ తెరవెనుక పాత్ర పోషించారని సమాచారం. పవన్ (మిగతా 10వ పేజీలో)

## జడ్పీ బరిలో...

## వైకాపా నుండి బొమ్మిరెడ్డి | తెదేపా నుండి ఏ రెడ్డో?







**జడ్పీ ఎన్నికలతో పల్లెల్లో తిరునాళ్ల మాదిరిగా ఉంది. పల్లెల్లో ఏ పార్టీ గాలి ఉందో, రేపు అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీ పరిస్థితేంటో తేల్చే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు గ్రామసీమలు ముస్తాబయ్యాయి.**

జడ్పీ బరిలో వైకాపా, తెలుగుదేశంపార్టీలే ప్రధానంగా తలపడబోతున్నాయి. వైకాపా జడ్పీ ఛైర్మెన్ అభ్యర్థిగా మాజీఎమ్మెల్సీ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఖరారయ్యారు. మేకపాటి సోదరులు ఆయన అభ్యర్థిత్వం కోసం గట్టిగా పట్టుబట్టి సాధించారు. తెలుగుదేశం జడ్పీ ఛైర్మెన్ అభ్యర్థిని ఇంకా ఖరారు చేయలేదు. వేనాటి రామచంద్రారెడ్డి, కంభం విజయరామిరెడ్డిలు ఛైర్మెన్ రేసులో ఉన్నారు. వేనాటి రామచంద్రారెడ్డి సూళ్లూరుపేట జడ్పీటీసీ నుండి కంభం విజయరామిరెడ్డి కొండాపురం జడ్పీటీసీ నుండి నామినేషన్ దాఖలు చేసారు. వీరిలో ఎవరు అభ్యర్థి అనేది నిర్ణయించడానికి సమయం పట్టేటట్లుంది.






# ఎగిరేది ఎవరి జెండా

**రాజకీయ చైతన్యానికి పెట్టిందిపేరు నెల్లూరు. ఈ నగరాన్ని రాజకీయరాజధాని అని కేంద్రమంత్రులే పేర్కొంటున్నారంటే ఇక్కడ రాజకీయాలకు ఎంతటి ప్రాముఖ్యత ఉందో అర్థం చేసుకోవచ్చు. నెల్లూరు మున్సిపాల్టీ అంటే ఎవరికైనా గుర్తుకొచ్చేది స్వర్గీయ ఏ.సి.సుబ్బారెడ్డి. ఈరోజుకీ నెల్లూరు నగరానికి ఆయన చేసిన అభివృద్ధి పనులు చిరస్మరణీయంగా ఉన్నాయి.**

దాదాపు మూడుదశాబ్దాల నెల్లూరు మున్సిపాల్టీ చరిత్రను పరిశీలిస్తే ఇప్పటివరకు జరిగిన అన్ని ఎన్నికలు కూడా కాంగ్రెస్, తెలుగుదేశంపార్టీల మధ్య నువ్వా-నేనా అన్న రీతిలో జరుగుతూ వచ్చాయి. ప్రత్యక్ష ఎన్నికల పోరులో అయితే కాంగ్రెస్ కంటే తెలుగుదేశమే పైచేయి సాధించడం చెప్పుకోదగ్గ విశేషం. 1987లో నెల్లూరు పురపాలక సంఘం ఛైర్మెన్ పదవికి ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో ఛైర్మెన్ అభ్యర్థిగా పోటీ చేసిన తాళ్లపాక రమేష్‌రెడ్డి ఘనవిజయం సాధించారు. 1995లో తెలుగుదేశం ప్రభుత్వంలోనూ ప్రత్యక్షఎన్నికలే జరిగాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా ఆనం వివేకానందరెడ్డి, తెలుగుదేశం అభ్యర్థిగా వై.టి.నాయుడు తలపడ్డారు. పోరు తీవ్రస్థాయిలో జరిగింది. నరాలు తెగే ఉత్కంఠత మధ్య కౌంటింగ్ జరిగింది. చివరి క్షణం వరకు నువ్వా-నేనా అన్నట్లు సాగిన ఈ పోరులో ఆనం వివేకానందరెడ్డి కేవలం 36ఓట్ల తేడాతో గెలవడం జరిగింది. మళ్లీ 2000 సంవత్సరంలో ఛైర్మెన్‌కు ప్రత్యక్షంగా జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం అభ్యర్థిగా పోటీచేసిన అనూరాధ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ పి.యశోధరపై 10వేలకుపైగా ఓట్ల మెజార్టీతో గెలిచారు. నెల్లూరు మున్సిపాల్టీకి ఇవే చివరి ప్రత్యక్ష ఎన్నికలు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. నెల్లూరు మున్సిపాల్టీ నగర పాలకసంస్థగా మారింది. 2005లో నెల్లూరు కార్పొరేషన్‌కు పరోక్షంగా ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ కంటే తెలుగుదేశంకే ఒక డివిజన్ అదనంగా వచ్చింది. అయితే ఆరోజు ఎంపీ, ముగ్గురు ఎమ్మెల్యేలు నగరపాలకసంస్థలో కో-ఆప్షన్ సభ్యులుగా ఉండడం, స్వతంత్రులుగా గెలిచిన కార్పొరేటర్లు కాంగ్రెస్‌కు మద్దతు తెలపడంతో నగరపాలకసంస్థను ఆ పార్టీ కైవసం చేసుకోగలిగింది. మేయర్లుగా మొదట పులమిశైలజ, ఆ తర్వాత భానుశ్రీలు పనిచేసారు.

నెల్లూరు మున్సిపాల్టీలో ఈ 30ఏళ్లు జరిగిన పోరు ఒక ఎత్తయితే ఇప్పుడు జరుగుతున్న పోరు మరో ఎత్తని చెప్పవచ్చు. నెల్లూరు మున్సిపల్ చరిత్రలో కాంగ్రెస్‌పార్టీ ప్రధాన పోటీలో లేకుండా జరుగుతున్న పోటీ ఇప్పుడు మన కళ్లముందుంది. నగరపాలక సంస్థ ఎన్నికలలో ప్రధాన పోటీ తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీల మధ్యే నెలకొంది. కనీసం ముక్కోణపు పోటీ కూడా కనిపించడం లేదు. మొత్తం 54డివిజన్‌లకు గాను అత్యధిక డివిజన్‌లలో తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌ల మధ్యే పోటీ నెలకొంది. కొన్ని డివిజన్‌లలో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థులు తమ వ్యక్తిగత పనితీరుతో గట్టి పోటీలో ఉన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ తొలిసారిగా నెల్లూరు మున్సిపల్ ఎన్నికల్లో దిగింది. బోణీ కొట్టాలని మేయర్ సీటును కైవసం చేసుకోవడం ద్వారా రేపు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు మరింత ఉత్సాహంగా దూసుకుపోవాలని భావిస్తున్నారు. తెలుగుదేశం వాళ్లది కూడా ఇదే ఆలోచన. నెల్లూరునగరంలో తెలుగుదేశంకు గట్టి పట్టుంది. ఈ పట్టును నిలుపుకుని రేపు అసెంబ్లీ ఎన్నికలకు వేగంగా పోవాలంటే కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశం జెండా ఎగరవేయాలనే పట్టుదలతో ఉన్నారు.


## నివాళి



మాకు అత్యంత ఆత్మీయులు, శ్రేయోభిలాషి, మంచికి మరోరూపు
రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నం గారి మాతృమూర్తి

**శ్రీమతి కొర్రపాటి తులశమ్మ గారి**

W/o. దివంగత కొర్రపాటి ఈశ్వరనాయుడు, నెల్లూరు.
మరణం బాధాకరం.
ఆ పుణ్యమూర్తి ఆత్మకు శాంతిని ప్రసాదించమని ఆ దేవదేవుని ప్రార్థిస్తూ...
నివాళులర్పిస్తున్నాను.

మీ.. **రావి మోహన్‌చౌదరి,** నెల్లూరు - బెంగుళూరు.


# పార్లమెంటుకు సై





నెల్లూరు లోక్‌సభ స్థానానికి అభ్యర్థులు దాదాపు ఖరారైనట్లుగా కనిపిస్తుంది. సిటింగ్ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి తిరిగి వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగానే పోటీ చేయనున్నారు. ఆయన వద్దంటే తప్పితే ఈ సీటును ఇంకొకరికి ఇచ్చే అవకాశం లేదు.

తెలుగుదేశం లోక్‌సభ అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఖరారు చేసారు. కాంగ్రెస్‌ను వదిలి ఆదాల తెలుగుదేశంలో చేరడం ఆ పార్టీకి కలిసొచ్చింది. లేకుంటే పార్లమెంట్ అభ్యర్థి కోసం ఆ పార్టీ తంటాలు పడాల్సి వచ్చేది. 2009లో నెల్లూరు లోక్‌సభ జనరల్ అయ్యింది. అంతకుముందు 40ఏళ్లుగా ఈ స్థానం ఎస్సీ రిజర్వేషన్‌లో ఉండింది. జనరల్‌గా మారాక ఈ సీటులో తెలుగుదేశంకు కలిసిరాలేదు. 2009ఎన్నికలలో ఓడిపోయింది. ఇటీవల జరిగిన ఉపఎన్నికల్లో అయితే ఆ పార్టీ మూడోస్థానానికి పోయింది. ఉపఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేయడానికి కూడా అందరూ భయపడితే బ్రతిమలాడి మళ్లీ వంటేరు వేణుగోపాల రెడ్డినే పోటీకి దించారు.

పార్టీలోకి ఆదాల రాకపోయి ఉంటే బీద మస్తాన్‌రావుకు తప్పేది కాదు. కాని ఈరోజు లోక్‌సభకు ఆదాల బలమైన అభ్యర్థి అయ్యాడు. మాగుంట శ్రీనివాసులురెడ్డిని తెలుగుదేశంలో చేర్చుకునే ప్రయత్నాలు జరుగు తున్నాయి. ఒకవేళ మాగుంట శీనయ్య వస్తే ఆయనను నెల్లూరు లోక్‌సభకు నిలబెట్టి ఆదాలను నెల్లూరు రూరల్‌కు పంపించాలనే ఆలోచన కూడా వుంది.

కాంగ్రెస్ టిక్కెట్ కోసం మాత్రం ఎవరూ ప్రయత్నించడం లేదు. ఎవరినైనా బలవంతంగా దించాల్సిందే! ఇప్పటికైతే ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డిని రెడీ చేసి పెట్టారు. ఆయన కూడా నిద్రలేచింది మొదలు సోనియా, రాహుల్, దిగ్విజయ్, అహ్మద్ పటేల్ స్థాయి నాయకులతో మాట్లాడుతుంటాడు. కాబట్టి ఆయనకు పార్లమెంట్ సెట్ అవుతుంది. కాంగ్రెస్‌కు గెలుపు పైన నమ్మకం లేదు కాబట్టి ఎవరు నిలబడ్డా నామమాత్రమే.

తెలుగుదేశంతో పొత్తు లేకుంటే బీజేపీ కూడా ఈ స్థానం నుండి పోటీ చేసే అవకాశాలున్నాయి. ఈ పొత్తు కుదిరినా కూడా ఈ స్థానాన్ని బీజేపీ కోరుతుంది. 1999 ఎన్నికలలో బీజేపీకే ఈ సీటు వదిలారు. అయితే అప్పుడు ఈ సీటు రిజర్వ్‌డ్‌లో ఉండడంతో ఇచ్చారు. ఇప్పుడు జనరల్‌గా మారింది. కాబట్టి తెలుగుదేశం పార్టీ ఈ సీటును బీజేపీకి వదిలే అవకాశం ఉండదు.

## వాళ్లు మారారు... పార్టీ రాతను మార్చారు




రాజకీయాలను ఒక్కోసారి నాయకులే శక్తివంతంగా ప్రభావితం చేస్తుంటారు. ఒక నాయకుడు పార్టీ మారితే ఆ పార్టీలో పరిస్థితులే తలక్రిందులవుతుంటాయి. నెల్లూరునగరంలో ఇప్పుడదే జరిగింది. నెల్లూరునగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డిలు కాంగ్రెస్‌ను వదిలి తెలుగుదేశంలోకి రాకపోయి ఉంటే ఈ పార్టీ పరిస్థితి ఇంకోరకంగా వుండేది. నగరపాలక సంస్థ ఎన్నికలలో తెలుగుదేశంపార్టీ పరిస్థితి ఇంత బాగా మెరుగయ్యేది కాదు. ఈరోజు ఒక్కో డివిజన్ టిక్కెట్‌కు తెలుగుదేశం పార్టీ నుండి ఇద్దరు, ముగ్గురు పోటీపడ్డారంటే కారణం వీళ్ల చేరికతో పార్టీ బలపడింది కాబట్టి!

మామూలుగానే నెల్లూరు తూర్పు ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉండేది. ప్రతి మున్సిపాల్టీ ఎన్నికలలోనూ తెలుగుదేశంపార్టీకి ఎక్కువవార్డులు వచ్చింది ఇక్కడే! కాని 2009 ఎన్నికలప్పుడు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి తెలుగుదేశంను వదిలి ప్రజారాజ్యంలోకి పోవడంతో తూర్పు ప్రాంతంలో పార్టీ బాగా బలహీనపడింది. 2009 ఎన్నికల్లో తెలుగుదేశం ఇక్కడ మూడోస్థానానికి పడిపోయింది. ముంగమూరు పార్టీలో చేరకపోయివుంటే ఇదే పరిస్థితి కొనసాగి ఉండేది. ఇప్పుడు ముంగమూరు తిరిగి పార్టీలోకి రావడంతో నెల్లూరు తూర్పు ప్రాంతంలో పార్టీ కేడర్‌కు వెయ్యేనుగుల బలం వచ్చింది. అలాగే ఆదాల ప్రభాకర్‌రెడ్డి చేరికతో నెల్లూరురూరల్ పరిసరాల్లోనూ పార్టీ బాగా పుంజుకోవడం విశేషం.

## దటీజ్ వివేకా!



ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇంకొకరెవరైనా నాయకుడిగా ఉంటే నెల్లూరు నగరపాలక సంస్థలోని 54డివిజన్‌లలో అభ్యర్థులను నిలబెట్టగలిగేవాడు కాదు. కాని కాంగ్రెస్ ఎంత దరిద్రంగా తయారైనా నగరంలోని 54డివిజన్‌లకు అభ్యర్థులను పెట్టడంలో ఆనం వివేకానందరెడ్డి సక్సెస్ అయ్యారు. అసలు కాంగ్రెస్ తరపున పోటీ చేసేందుకు అభ్యర్థులే రారనుకున్నారు. ఎక్కడా పోటీ చేయమంటారోనని భయపడి కొందరైతే ఏ.సి సెంటర్‌కు పోవడమే మానుకున్నారు. సీనియర్లు అయిన భానుశ్రీ, చాట్ల నరసింహారావు వంటి నాయకులు పోటీ నుండే మానుకున్నారు. ఇంకొందరైతే కాంగ్రెస్‌ను వదిలేసి వైయస్సార్ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలలో చేరిపోయారు. నాయకులు కాంగ్రెస్ టిక్కెట్ అంటేనే భయంతో పరుగులు తీసారు. వాస్తవానికి ఈరోజు కాంగ్రెస్ అభ్యర్థులుగా బరిలో వున్న కొంతమందికి వ్యక్తిగతంగా పేరుప్రతిష్టలున్నాయి. వారు ఇండిపెండెంట్లుగా పోటీ చేసినా గెలిచే సత్తావుంది. కాని హస్తం గుర్తు మీద పోటీ చేస్తున్నందువల్ల వాళ్లంతా నష్టపోయే అవకాశం ఉంది. అయినా అన్నింటినీ భరించి, గెలుపుపైన నమ్మకాలు లేకపోయినా కేవలం వివేకా మాట కోసమే వీళ్లంతా పోటీలో నిలిచారు. కాని 54 డివిజన్‌లలో అభ్యర్థులను పెట్టడమే ఈ ఎన్నికల్లో వారికి గెలుపనుకోవాలి.

## పట్టుదలకు పోలేక... పట్టు బిగించలేక...

# 'దేశం'లోనూ కొరవడుతున్న నాయకత్వం







రాజకీయపార్టీలలో నాయకులు ఎక్కువైనా కూడా నాయకత్వం వహించడం ప్రధాన సమస్యగా మారుతుంది. పార్టీ ఉందా, ఊడ్చుకుపోయిందా అనే విషయం పక్కనపెడితే నెల్లూరు నగరంలో కాంగ్రెస్ పార్టీకి ఆనం వివేకానందరెడ్డే ఏకైక నాయకుడు. ఆయన చెప్పిందే వేదం. ఆయన కనుసన్నలలో ఏక వాక్యంతోనే పార్టీ నడిచింది. ఈరోజు పరిస్థితుల వల్ల కాంగ్రెస్ దివాళా తీసి ఉండొచ్చు. పార్టీ బాగున్నప్పుడు కూడా నగరంలో వివేకా నాయకత్వమే చెల్లుబాటయ్యింది. దానివల్ల ఎటువంటి తలనొప్పులూ రాలేదు.

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చూస్తే నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమించినా పూర్తి అధికారాలు వారికివ్వకపోవడంతో ఇక్కడా లుకలుకలే!

నెల్లూరు తెలుగుదేశంపార్టీ మాత్రం ఎవరికివారే యమునాతీరే అన్నట్లుగా వుంది. తెలుగుదేశంపార్టీ మొన్నటివరకు నాయకత్వ లోటును ఎదుర్కొంది. కాని ఈరోజు ఆ పార్టీకి నాయకులు ఎక్కువ కావడమే ప్రధాన సమస్యగా మారింది. నాయకులు ఎక్కువ కావడంతో ఇప్పుడు నగరంలో పార్టీ కలగూరగంపగా మారింది. పాత నాయకులు, కొత్తగా వచ్చిన నాయకుల మధ్య సమన్వయం సాధించలేక పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర నానా తిప్పలు పడ్డాడు. ఎవరినీ కాదనుకోలేని పరిస్థితుల్లో ఆయన స్వతంత్రంగా వ్యవహరించ లేకపోయారు. ధైర్యంగా నిర్ణయాలు తీసుకోలేకపోయారు.

నెల్లూరు నగరపాలక సంస్థలో 54 డివిజన్‌లు ఉంటే నాయకులు తలాకొన్ని వాటాలేసుకుని పంచుకోవాల్సి వచ్చింది. పార్టీని మొదటి నుండి కనిపెట్టుకుని ఉన్నాడు కాబట్టి (మిగతా 10వ పేజీలో)




• నెల్లూరు కార్పొరేషన్‌ను

# సవాల్‌గా తీసుకున్న చంద్రబాబు

➢ కార్పొరేషన్‌లో గెలుపు కోసం అందర్నీ ఏకం చేసాడు

➢ మెజార్టీ అభ్యర్థుల గెలుపు బాధ్యతలు భుజాలకెత్తుకున్న సోమిరెడ్డి, ఆదాల, ముంగమూరు, బీద, కోటంరెడ్డి, కిలారి





***వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ బలంగా ఉందనుకుంటున్న నెల్లూరుజిల్లాలో తెలుగుదేశంపార్టీ అనూహ్యంగా బలం పుంజుకోవడం, మున్సిపల్ ఎన్నికల్లో శక్తివంతంగా పరుగులు తీస్తుండడంతో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు నెల్లూరుజిల్లాపై ప్రత్యేక దృష్టి సారించినట్లుగా తెలుస్తుంది. నెల్లూరు కార్పొరేషన్‌లో బోణీ చేయడం ద్వారా సీమాంధ్రలో రేపటి ఎన్నికల్లో జయకేతనాన్ని ఎగురవేయాలనే సంకల్పంతో ఉన్నారు.***

రాజకీయంగా నెల్లూరుకు ఓ సెంటిమెంట్ వుంది. ఇక్కడ ఏ పార్టీ గెలిస్తే రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి వస్తుంటుంది. నెల్లూరులో వచ్చే ఫలితాలు రాష్ట్ర రాజకీయాలనే ప్రతిబింబిస్తుంటాయి. నెల్లూరులో సినిమా హిట్ అయినా, పార్టీ హిట్ అయినా ఆ సక్సెస్ రాష్ట్ర వ్యాప్తంగా ఉంటుంది. కాబట్టే నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పార్టీ గెలుపును ఆయన సవాల్‌గా తీసుకున్నారు. ఈమేరకు ముఖ్యనాయకులందరినీ రంగంలోకి దించారు.

ఎమ్మెల్యేలు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డిల చేరికతోనే నెల్లూరులో పార్టీ ఎంతో బలపడింది. ముఖ్యంగా నెల్లూరు టూటౌన్‌లో ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి ప్రభావం ప్రత్యక్షంగా కనిపిస్తుంది. ఆదాల ప్రభాకర్‌రెడ్డి రావడంతో ఎన్నికల ఊపు వచ్చింది. నెల్లూరు కార్పొరేషన్‌లో గెలుపు రేపు వీరికి కూడా కీలకం. నెల్లూరు కార్పొరేషన్‌పై చంద్రబాబు దృష్టిపెట్టి ముఖ్యమైన నాయకులకు గెలుపు బాధ్యతలను అప్పగించినట్లు తెలుస్తుంది. డివిజన్‌ల టిక్కెట్ల విషయంలో నాయకుల మధ్య కొద్దిగా తేడాలు వచ్చినప్పటికీ నామినేషన్ల పర్వం పూర్తి కావడంతో అన్నీ సర్దుకున్నాయి. కలిసికట్టుగా పనిచేయండని చంద్రబాబు ఆదేశించడంతో జిల్లాలోని తెలుగుదేశం నాయకులంతా ఏకమయ్యారు. వర్గపోరుకు స్వస్తి చెప్పాలని ఒకరినొకరు వెన్నుపోటు పొడుచుకుంటుంటే నష్టపోయేది పార్టీయేనని నాయకులు భావిస్తున్నారు.

నెల్లూరు నగరంతో పార్టీ అభ్యర్థులకు సంబంధించి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు పర్యవేక్షిస్తున్నారు. నెల్లూరురూరల్ డివిజన్‌లను సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, వై.వి.రామిరెడ్డిలు పర్యవేక్షిస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర మొత్తం 54డివిజన్‌లలో పార్టీ వ్యవహారాలను అభ్యర్థుల గెలుపోటముల పరిస్థితి పరిశీలిస్తూ అభ్యర్థుల విజయానికి వ్యూహరచన చేస్తున్నారు.

ఇటీవల నెల్లూరులో చంద్రబాబు ప్రజాగర్జన విజయవంతం కావడం పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపింది. పార్టీ మేయర్ అభ్యర్థిగా నగరంలో మంచి చిన్నపిల్లల వైద్యుడిగా పేరున్న జడ్.శివప్రసాద్‌ను ప్రకటించడం కూడా పార్టీకి సానుకూల ఓటును పెంచింది. తెలుగుదేశంకు నగరంలో సానుకూల వాతావరణం కనిపిస్తుంది. మరి దీనిని వాళ్లెంతవరకు సద్వినియోగం చేసుకుంటారో చూడాలి.

# ఒంగోలు నుండి దినేష్‌రెడ్డి?



మాజీ డిఐజి, నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలం తాళ్లపూడి వాసి వేణుంబాక దినేష్‌రెడ్డి ఎన్నికల బరిలోకి దిగడానికి సంసిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది. వచ్చే ఎన్నికల్లో ఆయన ఒంగోలు లోక్‌సభ నుండి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగే సూచనలు కనిపిస్తున్నాయి. డిజిపిగా ఉన్నప్పుడే ఆయన రాజకీయాల్లోకి అడుగుపెట్టాలనే దిశగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది.



## నెల్లూరు కార్పొరేషన్ బరిలో

# విద్యావంతుడు మనోహర్‌రెడ్డి

నెల్లూరు కార్పొరేషన్‌లో విద్యావంతులు, మేధావులు, విషయపరిజ్ఞానం వున్నవారు చాలా తక్కువుగా కనిపిస్తున్నారు. ఓ స్కూలుకు కరస్పాండెంట్‌గా వున్న కాంగ్రెస్ సీనియర్ మాజీకార్పొరేటర్ చాట్ల నరసింహ రావు ఉన్నట్లుండి మున్సిపల్ ఎన్నికల బరి నుండి తప్పుకున్నాడు. దాంతో నెల్లూరులో విద్యాసంస్థల ప్రతినిధిగా, సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తిగా ఉండాలనే ఉద్దేశ్యంతో మైథిలి స్కూల్ కరస్పాండెంట్ బసివిరెడ్డి మనోహర్‌రెడ్డి ముందుకొచ్చారు. ఆయన కాంగ్రెస్‌పార్టీనో లేదంటే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీనో టిక్కెట్ అడిగుంటే కళ్లు మూసుకుని ఇచ్చి ఉండేవాళ్లు. కాని ఆయన తెలుగుదేశంపార్టీ అభిమాని. చంద్రబాబు నాయకత్వాన్ని ఇష్టపడే వాడు. కాబట్టే ఆయన 29వ డివిజన్ నుండి తెలుగుదేశం పార్టీ టిక్కెట్‌ను ఆశించాడు. అక్కడ నెలకొన్న వర్గపోరు మూలంగా ఆయన టిక్కెట్ కోసం చాలా కష్టపడాల్సి వచ్చింది. అయితే చంద్రబాబు సూచనతో చివరి నిముషంలో ఆయనకు బి–ఫారం పొందే అవకాశం వచ్చినా, పార్టీలోని కొందరు కిలాడీ నాయకుల చేష్టలవల్ల ఆయన చేతికి బి–ఫారం అందినట్లే అంది చేజారింది. అయినా తెలుగుదేశం అభిమానిగా 29వ డివిజన్ నుండి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఎన్నికల అధికారులు ఆయనకు ఉంగరం గుర్తును కేటాయించారు.

ఎలక్షన్‌లు చాలా కంపుగా తయారవుతున్నాయి. డబ్బుంటే చాలు ఎప్పుడు వచ్చినా టిక్కెట్లు ఇవ్వడానికి పార్టీలు సిద్ధంగా ఉన్నాయి. కాంట్రాక్టర్లు, వ్యాపారులు, నిరక్షరాస్యులు... ఇదీ ఎన్నికల్లో నిలబడుతున్న అభ్యర్థుల తీరు. విద్యావంతులను, నగరంలో సమస్యల పట్ల అవగాహన ఉన్న వారిని కౌన్సిల్‌కు పంపించాలని, ఒక మంచి కౌన్సిల్‌ను ఏర్పాటు చేయడం ద్వారా నగరాభివృద్ధికి పాటుపడాలనే ఆలోచన ఏ పార్టీకీ లేకుండా పోతుంది. ఇండిపెండెంట్‌గా బరిలో ఉన్నప్పటికీ మనోహర్‌రెడ్డి ఉత్తమమైన అభ్యర్థి. విద్యావంతుడు, సామాజిక స్పృహ ఉన్న మనిషి. ముఖ్యంగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా వున్న సమయంలో జన్మభూమిపై అనేక కార్యక్రమాలు చేపట్టారు. చదువు సంధ్య లేక చిల్లరమల్లరగా తిరుగుతున్న వందలాది మంది పిల్లలను బ్రిడ్జి స్కూళ్లలో చేర్పించారు. జన్మభూమికి విశేష ప్రాచుర్యం కల్పిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలలో చైతన్యం కలిగించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నో సేవాకార్యక్రమాలు నిర్వహించారు. విద్య, వైద్యపరంగా ఎంతోమందిని ఆదుకున్నారు. ఉద్యోగం నుండి విరమణ పొందాక అక్షద ఫౌండేషన్‌ను స్థాపించి ప్రతిఒక్కరి చేత మొక్కలు నాటించడం ద్వారా 29వ డివిజన్‌తో పాటు నగరంలో వివిధ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపుకు కృషిచేసారు. నిద్ర లేచింది మొదలు ఏ రోడ్డు కాంట్రాక్టు, ఏ కాలువ కాంట్రాక్ట్ తీసుకుందామా అని ఆలోచించే వాళ్లను కాదు, సమాజం పట్ల తమవంతు బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తించే మనోహర్ రెడ్డి వంటి వారిని మన ప్రతినిధులుగా ఎన్నుకోవాల్సి వుంది.

## తమిళనాట తెలుగువారి ఐకమత్యాన్ని చాటిన

# త్రిసంగ మహోత్సవం

*తమిళనాడులో తెలుగు కోయిల ముందే కూసింది. తమిళనాట నివసిస్తున్న దాదాపు 25వేల మందికి "ఉగాది" పండుగ ముందే వచ్చింది. ఆలిండియా తెలుగు ఫెడరేషన్ ఆధ్వర్యంలో తమిళ రాష్ట్రంలో వున్న అన్ని తెలుగు సంస్థలూ ఒక వేదికపై చేరి "త్రిసంగ మహోత్సవం" పేర ఉగాది సంబరాలను మార్చి 16వతేదీన జరుపుకున్నారు.*



డా॥ సి.యం.కె.రెడ్డిని సన్మానిస్తున్న తమిళనాడు గవర్నర్ డా॥ కె.రోశయ్య, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ చలమేశ్వర్

మద్రాసులోని నెహ్రూ ఇండోర్‌స్టేడియంలో జరిగిన ఈ మహావేడుకలో తమిళనాడు గవర్నర్ డా॥కొణిజేటి రోశయ్యతో పాటు సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ కూడా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చెన్నైలోని తెలుగువారి ముద్దుబిడ్డ డా॥ సి.యం.కె రెడ్డి ఈ కార్యక్రమానికి సారథ్యం వహించి నడిపించారు. నెల్లూరీయుల గారాలపట్టి సుమధుర రాగాల రారాజు డా॥యస్.పి.బాలసుబ్రహ్మణ్యం కూడా ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. జి.ఆనంద్ బృందం మను అందించిన సంగీత సౌరభాలు సభని రంజింపజేశాయి.



ఎస్పీ బాలును సత్కరిస్తున్న రోశయ్య

ఈ సందర్భంగా ఆయా రంగాలలో నిష్ణాతులైన పలువురు తెలుగు వారిని కమిటీ పక్షాన డా॥రోశయ్య, చలమేశ్వర్‌గారలు సన్మానించారు. తెలుగువారి కోసం ప్రత్యేక భవనం, తెలుగువారికి సరైన గుర్తింపువంటి పలు అంశాలపై ఈ సభలో తీర్మానాలు చేశారు. పాతికవేల మందిని ఒకే ప్రాంగాణానికి చేర్చి తెలుగువారి ప్రాతినిధ్యాన్ని తమిళతంబిలకి తెలియజేసిన డా॥సి.యం.కె.రెడ్డిని డా॥రోశయ్య, చలమేశ్వర్‌లు అభినందించి సన్మానించారు.

తమిళనాడు నలుచెరుగులా వున్న తెలుగు వారినందరిని ఒకచోట చేర్చడం ఎంతో సాహసోపేతమైన కార్యక్రమం. ఈ ఘనకార్యాన్ని సమర్థవంతంగా నిర్వహించి తెలుగువారి సత్తాచాటిన డా॥సి.యం.కె.రెడ్డికి "లాయర్" అభినందనలు.



చలమేశ్వర్‌కు జ్ఞాపిక



సినీనటి శారదకు సత్కారం



ఎస్పీశైలజకు అభినందన






## ప్రజల్లో ఉండేవాళ్లని ఎన్నుకోండి

నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో అభ్యర్థులను రాజకీయాల కతీతంగా ఎన్నుకుంటే మంచిది. విద్యావంతులు, చిత్తశుద్ధితో పని చేయగల అభ్యర్థులను కార్పొరేటర్లుగా, మేయర్‌గా ఎన్నుకోవాల్సి వుంది. మంచిఅభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారానే మన నెల్లూరును మనం బాగు చేసుకోగలం.

అళహరి రాజగోపాల్, నెల్లూరు.

## డబ్బుకు లొంగొద్దు

ఎన్నికల విధానాన్ని చూస్తుంటే కడుపు మండిపోతుంది. ఒకప్పుడు ఎన్నికలంటే పార్టీల పట్ల, నాయకుల పట్ల ప్రజలలో అభిమానం కనిపించేది. పార్టీ గుర్తు మీద అభిమానంతో ఓటేసేవాళ్లు. కాని ఇప్పుడు పార్టీలపై ఆ అభిమానమే లేదు. ఏ పార్టీ టిక్కెట్ వస్తుందంటే ఆ పార్టీలోకి నాయకులు పరుగులు తీస్తున్నారు. ఎవరు ఎక్కువ డబ్బులిస్తే వారికి జనం ఓట్లేస్తున్నారు.

ఇందూరు నాగేశ్వరరెడ్డి, గూడూరు.

## మతతత్వం పనికిరాదు

వై.యస్. అన్నా వై.యస్. కుటుంబసభ్యులన్నా రాష్ట్రప్రజలకు ఎంతో అభిమానముంది. ప్రజలంటే అన్ని మతాల వారు ఉంటారు. కాని విజయమ్మ, జగన్‌లు ఒక మతానికి ఎక్కువగా ప్రాధాన్యతనిస్తున్నారు. ఆ మతాన్ని ప్రోత్సహించే విధంగా నడుచుకుంటున్నారు. వై.యస్. ఏనాడు ఈ విధంగా చేయలేదు. ప్రజానాయకుడిగా ఎదగాలనుకునే వారికి ఈ మతతత్వం పనికిరాదు.

కృష్ణ, నెల్లూరు.

## రాష్ట్రపతిపాలనే భేష్

రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన పెట్టడం మంచి పరిణామమే. లేకుంటే ముఖ్యమంత్రి పదవి కోసం సీమాంధ్ర, తెలంగాణ నాయకులు మళ్లీ తన్నుకునేవాళ్లు. ఇప్పటికే రాష్ట్రం నాశనమైంది. విద్యార్థులు నష్టపోయారు. వ్యాపారాలు దెబ్బ తిన్నాయి. నరసింహన్ సమర్థుడు. పిచ్చిపిచ్చి ఉద్యమాలు అణగారిపోయాయి. గవర్నర్ పాలనే బాగుంది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

# 'ప్రభా'తం

దేశం మరోసార్వత్రిక ఎన్నికల సమరాంగానికి ముస్తాబయ్యింది. అన్ని రాజకీయపార్టీలు కూడా యుద్ధవేదిక మీదకు దూకడానికి కత్తులు నూరుతున్నాయి. అన్ని పార్టీలు కూడా దేశంలోని 543లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసేపనిలో ఉన్నాయి. యూపిఏ, ఎన్డీఏ, థర్డ్ ఫ్రంట్ కూటములు కేంద్రంలో అధికార సాధన దిశగా కసరత్తును ముమ్మరం చేసాయి. ఎన్నికల తర్వాత ఏదో ఒక కూటమి అధికారంలోకి వస్తుంది. అయితే ఇలాంటి కూటములు ఎంతకాలం నిలుస్తాయన్నది ఇప్పుడు ప్రశ్నార్థకమవుతుంది. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టతకే అది సవాల్‌గా మారుతుంది.

ఇంకెన్ని సార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగినా కూటములు తప్ప సొంతంగా ఒక పార్టీకి సంపూర్ణ మెజార్టీ వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. జాతీయపార్టీలు ప్రాంతీయపార్టీల స్థాయికి దిగజారిపోవడమే ఇందుకు కారణం. కేంద్రంలో ఒకే ఒక పార్టీ పూర్తి మెజార్టీతో అధికారంలోకి రావడమన్నది 1992లో పి.వి.నరసింహ రావుతోనే ఆగిపోయింది. అప్పుడు కూడా ఆయన ఎన్నో పార్టీలను చీల్చి కాంగ్రెస్‌కు మద్దతు కూడగట్టడం ద్వారా ప్రభుత్వాన్ని నడపగలిగాడు. ఆ తర్వాత కేంద్రంలో సంపూర్ణ మెజార్టీతో ఒకే పార్టీ అధికారంలోకి రావడమన్నది కలగా మారింది.

రేపటి సార్వత్రిక ఎన్నికలకు 30వేలకోట్ల దాకా ఖర్చవుతుందని అంచనా! ఇది ప్రభుత్వ ఖర్చు. ఇక అభ్యర్థులు, రాజకీయపార్టీలు పెట్టే ఖర్చును చూస్తే లక్షలకోట్లలోనే ఉంటుంది. ఐదేళ్లకోసారి ఈ ఖర్చును భరించడానికి దేశవ్యవస్థ సిద్ధంగా ఉంటుంది. ఎందుకంటే ఇది తప్పని ఖర్చు. కాని అయిదేళ్లలో రెండుసార్లు, లేదంటే మూడుసార్లు ఈ ఖర్చును భరించాలంటే దేశ ఆర్థిక వ్యవస్థ అంత పటిష్టంగా ఉందా? ఆర్థికంగా అగ్రదేశాలైన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్, జర్మనీలలో మనమెప్పుడైనా మధ్యంతర ఎన్నికలను గురించి విన్నామా? వాళ్లకు మధ్యంతర ఎన్నికల ప్రశ్నే వుండదు. వాళ్ల రాజకీయ వ్యవస్థ అంత స్థిరత్వం కలిగి ఉంది.

కాని భారత పార్లమెంట్ వ్యవస్థే నానాటికీ బలహీనపడుతూ వస్తుంది. పార్లమెంట్ బలహీన పడసాగాకే మూడు దశాబ్దాల కాలంలో నాలుగుసార్లు దేశం మధ్యంతర ఎన్నికలను ఎదుర్కోవాల్సి వచ్చింది. దేశానికి ఇది ఆర్థికంగా ఎంత భారం? 1999లో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కేవలం ఒకే ఒక సీటు తగ్గినందువల్ల పడిపోయింది. ఒక్క సీటు తగ్గిన పాపానికి మధ్యంతర ఎన్నికల రూపంలో దేశ ఆర్థిక వ్యవస్థపై వేలకోట్ల భారం పడింది. మంచికైనా, చెడుకైనా కేంద్రంలో సుస్థిర, సమర్థవంతమైన ప్రభుత్వాలు ఏర్పాటు కావడం దేశానికే మంచిది. వారాలలో, నెలల్లో కూలిపోయే ప్రభుత్వాలను ఎన్నుకుంటే దేశప్రజాస్వామ్య వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ కూడా కుప్ప కూలడం ఖాయం.

కాని రేపు జరగబోతున్న ఎన్నికలు, ఆ తర్వాత ఫలితాల తీరును గమనిస్తే భారత పార్లమెంటుకు మధ్యంతర భయం తొలిగిపోలేదనిపిస్తుంది. లోక్‌సభలో 272మార్క్ సీట్లు సాధించే పరిస్థితి ఏ కూటమికీ లేదు. ప్రస్తుతం సర్వేలను బట్టి చూస్తుంటే ఎన్డీఏ పెద్దకూటమిగా అవతరించే అవకాశమున్నా 272టార్గెట్ దాటడం అనుమానమే. ఈ కూటమి ఆ టార్గెట్ దాటితే ఇబ్బంది లేదు. 5ఏళ్లు కేంద్రంలో సుస్థిర ప్రభుత్వమే ఉండొచ్చు. ఎందుకంటే ఇప్పుడున్న కూటమిలో ఏ పార్టీ కూడా ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే పరిస్థితి లేదు. అలాకాకుండా ఈ కూటమికి పూర్తి మెజార్టీ రాకపోతే మరికొన్ని చిన్నాచితకా పార్టీల మద్దతు అవసరమవుతుంది. అప్పుడు రెండు సీట్లున్న ప్రాంతీయ పార్టీలు కూడా కీలకంగా మారుతాయి. రెండు సీట్లున్న పార్టీలు 200సీట్లు కలిగిన పార్టీని శాసిస్తుంటాయి. ప్రాంతీయ పార్టీలు గొంతెమ్మ కోరికలతో కేంద్రం గొంతు మీద కూర్చుంటాయి. ఇవి తీర్చలేక, అలాగని వ్యతిరేకించలేక కేంద్ర పాలకులకు ఈ సమస్యలతోనే సరిపోతుంది. ఒకవేళ ఎన్డీఏకు వ్యతిరేకంగా కాంగ్రెస్, థర్డ్‌ఫ్రంట్‌లు కలిసి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా ఇదే పరిస్థితి. కాంగ్రెస్ మద్దతుతో కేంద్రంలో మూడోఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడితే దేశానికి మరోసారి మధ్యంతర ఎన్నికల ప్రమాదమున్నట్టే! చరిత్రలో ఇప్పటివరకు మూడు సంకీర్ణ ప్రభుత్వాలను కూల్చి మధ్యంతర ఎన్నికలను దేశంపై రుద్దిన ఘనత కాంగ్రెస్‌పార్టీదే! అధికారంలో కాంగ్రెస్ లేకుండా ఆ పార్టీ మద్దతుతో కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పడడమనేది ప్రమాదకరచర్య.

దేశంలో చీటికిమాటికి ప్రభుత్వాలు కూలిపోవడం, మధ్యంతర ఎన్నికలు రావడం అనే ప్రహసనానికి స్వస్తి పలకాలి. ఈ తంతు ఆగిపోవాలంటే కేంద్రంలో సమర్థవంతమైన పార్టీలు, శక్తివంతమైన నాయకత్వాలు రావాలి. జాతీయ రాజకీయాలపై ప్రాంతీయ పార్టీల ప్రభావం కూడా తగ్గాలి. ఒకసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే ఐదేళ్ల వరకు అది స్థిరంగా నిలిచేలా ఉండాలి. ఏక పార్టీ పాలనతోనే ఇది సాధ్యమవుతుంది. కాని ఒకే పార్టీకి మెజార్టీ కష్టమనుకున్న పక్షంలో కనీసం ఎన్నికల ముందే పార్టీల సమూహంగా మారిన కూటములలో మంచి కూటమికన్నా సంపూర్ణ మెజార్టీ ఇవ్వగలిగితే కొంతలోకొంత మంచి వాతావరణ మన్నా ఏర్పడగలదు.

## వినాశకర విధానం



సార్వత్రిక ఎన్నికలకు 30వేలకోట్ల దాకా ఖర్చవుతుందని అంచనా! ఇది ప్రభుత్వ ఖర్చు. ఇక అభ్యర్థులు, రాజకీయపార్టీలు పెట్టే ఖర్చును చూస్తే లక్షలకోట్లలోనే ఉంటుంది. ఐదేళ్లకోసారి ఈ ఖర్చును భరించడానికి దేశవ్యవస్థ సిద్ధంగా ఉంటుంది. ఎందుకంటే ఇది తప్పని ఖర్చు.

# 'అంతర్'జాతీయం

- ఉత్తరప్రదేశ్ మధుర జిల్లాలోని బృందావనంలో 70అంతస్థుల శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి ముఖ్యమంత్రి అఖిలేష్‌యాదవ్ 17వ తేదీ శంకుస్థాపన చేసారు. 62ఎకరాల సువిశాల ప్రాంగణంలో 300కోట్లతో ఇస్కాన్ సంస్థ ఈ ఆలయాన్ని నిర్మిస్తుంది.
- అమెరికా వాణిజ్యశాఖ అసిస్టెంట్ సెక్రటరీ, అంతర్జాతీయ వ్యాపారసంస్థలో అమెరికా, విదేశీ వాణిజ్య సేవల డైరక్టర్ జనరల్‌గా భారతీయ అమెరికన్ అరుణ్.ఎం కుమార్‌ను నియమించింది. కుమార్ కేరళ యూనివర్సిటీ నుండి భౌతిక శాస్త్రంలో పట్టాపొందారు.
- బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోడీ యూపీలోని వారణాసి నుండి బరిలోకి దిగనున్నారు. బీజేపీ అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్ లక్నో నుండి పోటీ చేస్తున్నారు.
- రాజస్థాన్‌లోని కోటాలో 2400కోట్లతో రెండో అణుఇంధన సముదాయాన్ని ఏర్పాటు చేయనున్నారు. అణుఇంధనాన్ని పునఃశుద్ధి చేయడానికి ఈ సముదాయాన్ని నిర్మిస్తారు.
- అశ్లీల సైట్లు, ఔషధాల సమాచారం వంటి అనవసరమైన అంశాలతో నిండిన స్పామ్ మెయిల్స్ పంపుతున్న వారి జాబితాలో భారత్ నాలుగో స్థానంలో ఉందని మైక్రోసాఫ్ట్ తాజా నివేదికలో పేర్కొంది.
- ప్రపంచంలోనే అత్యంత కలుషిత నగరాలలో మన దేశంలోని లూధియానా, కాన్పూర్‌లు చేరాయి. 2011 ఏడాదికి సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన నివేదికలో తొలి పది నగరాలలో ఈ రెండు నగరాలు చోటుచేసుకున్నాయి.
- గల్లంతైన మలేషియా విమానం ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. అయితే కో-పైలట్ ఫరీఖ్‌అబ్దుల్ హమీద్ నుండి మాత్రం ఆల్‌రైట్... గుడ్‌నైట్ అనే చివరి సందేశం వచ్చినట్లు మలేషియా అధికారులు వెల్లడించారు.
- ఈ నెల 17వ తేదీ దేశవ్యాప్తంగా హోళీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఢిల్లీలోని బీజేపీ, కాంగ్రెస్ అధ్యక్షుల నివాసాలలో జరిగిన హోళీ వేడుకలలో ఆ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- ఉక్రెయిన్ నుండి విడిపోయిన క్రిమియాను రష్యా పటంలో చేర్చే ఒప్పందంపై రష్యా అధ్యక్షుడు పుతిన్ సంతకం చేసారు. మా మనసుల్లో క్రిమియా ఎల్లప్పుడూ రష్యాలో అంతర్భాగమేనన్నారు. ఉక్రెయిన్‌లోని ఇతర ప్రాంతాలపై దాడిచేసే ఉద్దేశ్యం లేదని ఆయన పేర్కొన్నారు.

# వార్త వ్యాఖ్య

వార్త :- ఈసారికి ఆశలేనట్లే! - దిగ్విజయ్‌కి స్పష్టం చేసిన సీమాంధ్ర నేతలు.
**వ్యాఖ్య :- *వచ్చేసారి కూడా ఇదే మాట అనుకోవాల్సిందే!***

వార్త :- తెలంగాణలో సమైక్య ఉద్యమం వస్తుంది. - కిరణ్.
**వ్యాఖ్య :- *కొంపదీసి అక్కడ చేరి మీరే మొదలుపెడతారా?***

వార్త :- ప్రజలు భిన్నమైన తీర్పిస్తారు. - లాలూ.
**వ్యాఖ్య :- *వాళ్లెప్పుడూ భిన్నమైన తీర్పునే ఇస్తారు. కాబట్టే మీరు ప్రతిపక్షంలో ఉన్నారు.***

వార్త :- కాంగ్రెస్‌ను అంటరాని పార్టీగా చూడడం లేదు. - సీపీఐ నారాయణ.
**వ్యాఖ్య :- *ఎవరితోనైనా పోవడానికి రెడీగా ఉన్నామని చెప్పడమేగా!***

వార్త :- కాంగ్రెస్‌తో పొత్తుండదు. - కేసీఆర్.
**వ్యాఖ్య :- *తెలంగాణ ఏర్పడగానే ఆ విషయం అర్థమైపోయిందిలే!***

వార్త :- బీజేపీ బలం పెరిగితే ప్రమాదం. - బి.వి.రాఘవులు.
**వ్యాఖ్య :- *కమ్యూనిస్టులకా?***

వార్త :- కేసీఆర్ తెలంగాణ రాదనుకున్నారు. - చంద్రబాబు.
**వ్యాఖ్య :- *వస్తుందనుకుంటే విలీనం చేస్తానని ఎందుకంటాడు.***

వార్త :- నాయకులు లేని పార్టీ కాంగ్రెస్. - వెంకయ్యనాయుడు.
**వ్యాఖ్య :- *రేపు కార్యకర్తలు, ఎల్లుండి ఓటర్లు కూడా ఉండరు.***

వార్త :- కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేరుస్తాం. - రఘువీరారెడ్డి.
**వ్యాఖ్య :- *ఏ రాష్ట్రంలో కూడా చెప్పండి.***

వార్త :- జెండా మోసేవారికి కాంగ్రెస్‌లో కొదవలేదు. - చిరంజీవి.
**వ్యాఖ్య :- *ఓట్లేసే వాళ్లకే కొరత...***

వార్త :- మోడీని ఓడించడమే ప్రధాన లక్ష్యం. - కేజ్రీవాల్.
**వ్యాఖ్య :- *మీరు గెలవాలనేది ఇంపార్టెంట్ కాదా?***

వార్త :- త్వరలో సంచలనాత్మక విషయం వెల్లడిస్తా. - మోహన్‌బాబు.
**వ్యాఖ్య :- *మన పని ఎప్పుడూ అదేగా!***

వార్త :- అందరికీ ఉచితంగా సెల్‌ఫోన్లు. - చంద్రబాబు.
**వ్యాఖ్య :- *మీరు సీఎం అయ్యేదాకా ఎవరినీ ఫోన్లు కొనొద్దంటారు.***

## "నమో" నామస్మరణతో...

# వాడవాడలకు వెంకయ్య

నేను భారతీయ జనతాపార్టీ వ్యక్తిగా మీ ముందుకు రాలేదు. ఓ భారతీయ పౌరుడిగా మిమ్మల్ని అర్థిస్తున్నాను రాబోయే ఎన్నికల్లో నరేంద్రమోడీ అభ్యర్థిత్వాన్ని బలపరచండి, సమర్థమైన నేతను ప్రధాన మంత్రిగా ఎన్నుకోండి, ఇదీ బీజేపీ జాతీయ నాయకుడు ముప్పవరపు వెంకయ్యనాయుడు నినాదం. ప్రస్తుతం మోడీని ప్రధాన మంత్రిగా చేయండంటూ ఆయన అవలం భిస్తున్న విధానం.

పార్టీతో నాకు సంబంధంలేదు, నేను బీజేపీ వాడిగా మీ ముంగిళ్ళకు రాలేదు అంటూనే వెంకయ్య రాత్రనక పగలనక తన శ్రమనంత ధారపోసి "నమో" నామ స్మరణతో బీజేపీ బలపరచిన నరేంద్ర మోడీని ప్రధానిని చేయాలంటూ భారత దేశమంతా తిరుగుతున్నాడు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న పర్యటనలలో భాగంగా మార్చి 16వతేది ఆదివారం ఉదయం చెన్నైలోనూ సాయంత్రం హైద రాబాదులోనూ 17వతేదీ సాయంత్రం విజయవాడలోనూ ఆయన "మోడీ ఫర్ పి.యం" అనే నినాదంతో ఏర్పాటుచేసిన పలు ఆత్మీయ సదస్సులలో పాల్గొని ప్రసంగించాడు.

ఆర్థిక మాంద్యంలో వున్న భారత దేశాన్ని కాపాడుకోవడానికి సమర్థవంత మైన నాయకత్వాన్ని ఎన్నుకోవలసిన సమయం ఆసన్నమైయిందని దేశంలోని ఎన్నో ప్రముఖ కంపెనీలు నష్టాల బాటలో పయనిస్తున్నాయని ఈ పాపమంతా కాంగ్రెస్ పార్టీదేనని వెంకయ్యనాయుడు దుయ్యబట్టారు. వాజ్‌పాయ్ పాలనలో జాతీయ రహదారులను వన్‌వే నుండి ఫోర్‌వేలుగా మారిస్తే వాటిని 6లైన్లుగా మార్చవలసిన ప్రయత్నం చేయవలసిన ప్రభుత్వం ఇంతవరకు వాటిని పట్టించు కున్న పాపాన పోలేదని అన్నారు. కొత్తగా మంజూరుకాబడిన అనేక రహదారులు ఇంకా శంకుస్థాపనకు సైతం నోచుకోలేదని విమర్శించారు.

భారతదేశ ప్రతిష్ట దిగజారిపోయిం దని ఉగ్రవాద సంస్థలు మన దేశంలోనే మకాంవేసి మనమీద దాడి చేయడానికి సిద్ధంగా వున్నాయని, భారతదేశాన్ని అన్ని రంగాలలో అధఃపాతాళానికి తొక్కేసిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. దూర దృష్టి, సమర్థత, సామర్థ్యం వున్న నాయ కుడిని దేశసారథిగా ఎన్నుకుంటే దేశం సుభిక్షంగా వుంటుందని, పార్టీలకతీతంగా అందరూ విజ్ఞతతో ఆలోచించి నరేంద్ర మోడీ అభ్యర్థిత్వాన్ని బలపరచాలని పిలుపునిచ్చారు. చీకటిలో వున్న భారత్‌కు వెలుగులు ప్రసాదించగల ఏకైక నాయ కుడు నరేంద్రమోడీనేనని ఆయన గెలుపు భారతదేశ ప్రగతికి కొత్త మలుపుగా మారుతుందని అన్నారు.

### చెన్నైలో ఆత్మీయ సదస్సు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న యం.వెంకయ్యనాయుడు

ఆదివారం ఉదయం 9గంటలకు చెన్నైలోని ఉడ్‌ల్యాండ్స్ హోటల్‌లో జరిగిన సమావేశంలో చెన్నైకి చెందిన పలువురు రాజకీయవేత్తలతో పాటు చెన్నైలో నివసించే అనేకమంది తెలుగు ప్రముఖులు, పారి శ్రామికవేత్తలు, మేధావులు పాల్గొన్నారు. బిజెపి తమిళరాష్ట్ర అధ్యక్షుడు రాధా కృష్ణన్‌తో పాటు శ్రీ సిటి ఛైర్మెన్ రవి సన్నారెడ్డి, వెంకయ్య కుమార్తె దీప, వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విఐటి) ఫౌండర్ ఛైర్మెన్ ప్రొ॥విశ్వనాథన్‌తో పాటు మరికొంతమంది స్థానిక నేతలు వేదికపై ఆశీనులు కాగా, ప్రొఫెసర్ డా॥సి.యం.కె. రెడ్డి, కెన్సస్ గ్రూప్ ఛైర్మెన్ నరసారెడ్డి, సీబ్రోస్ అధినేత సుబ్బారెడ్డి, గీతాంజలి నిర్మాత సియల్ నరసారెడ్డి, ఆంధ్రాక్లబ్ అధ్యక్షుడు ఆదిశేషయ్యతో పాటు అనేకమంది తెలుగు వారు ఈ సదస్సుకు హాజరయ్యారు.



వెంకయ్యనాయుడుతో నరసారెడ్డి

# 'దేశం' మేయర్ అభ్యర్థిగా డాక్టర్



నెల్లూరు నగరపాలకసంస్థ ఎన్నికలలో తెలుగు దేశం పార్టీ మేయర్ అభ్యర్థిగా డాక్టర్ జడ్.శివ ప్రసాద్‌ను నిర్ణయించారు. పార్టీ అధినేత చంద్రబాబు ఈమేరకు బుధవారం నిర్ణయం తీసుకున్నట్లు తెలి సింది. శుక్రవారం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్రలు అధికారికంగా ప్రకటించనున్నారు. నామినేషన్లప్పుడే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ వ్యాపార వేత్త, మైనార్టీ వర్గానికి చెందిన షేక్ అబ్దుల్ అజీజ్‌ను మేయర్ అభ్యర్థిగా ప్రకటించింది. కాంగ్రెస్ మాత్రం మేయర్ అభ్యర్థిని ప్రకటించలేదు. ఎలాగూ మెజార్టీ సీట్లు వస్తాయనే నమ్మకం లేదు కాబట్టి వారికి ఆ అవసరం లేకుండా పోయింది. ఇక ఎన్నికలకు 10 రోజులే వున్న నేపథ్యంలో తెలుగుదేశంపార్టీ నగరంలో మంచి ప్రజావైద్యుడిగా పేరున్న చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ జడ్.శివప్రసాద్‌ను మేయర్ అభ్యర్థిగా నిర్ణయించింది. నాయకుడిగా కంటే వైద్యుడిగా నగరంలో ఎక్కువ పరిచయాలున్న వ్యక్తి డాక్టర్ జడ్.శివప్రసాద్. వివాదరహితుడిగా పేరుంది. తెలుగుదేశం పార్టీలో చాలాకాలంగా ఉంటున్నాడు. పార్టీపరంగా బాధ్యతలు అప్పగిస్తే వాటిని నెరవేర్చడం తప్ప పదవులు ఆశించకుండా పనిచేసాడు. పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి తన వృత్తి పరంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాడు. నగరంలో విస్తృతంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి తన స్థాయిలో మంచి పనులే చేసాడు. కాబట్టే జడ్.యస్ మేయర్ అభ్యర్థి కావడం నెల్లూరు మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశంకు కొంతవరకు కలిసొస్తుందని రాజకీయ విశ్లేషకుల అంచనా!

# ఎన్నికల యుద్ధానికి మేం సిద్ధం

**- ఎస్పీ నవదీప్‌సింగ్**



జిల్లాలో మున్సిపల్, పంచాయితీ రాజ్, సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవాల్ చెప్పారు. మంగళవారం నెల్లూరు పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 49 చెక్‌పోస్టులను, 30స్టాటిస్టిక్ సర్వేలైన్ బృందా లను, 30ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలను ఏర్పాటు చేసి నిఘా పెట్టడం జరిగిం దన్నారు. ఈ నెల 5 నుండి 17వ తేదీ వరకు జిల్లాలో 8,24,61,165 రూపాయల నగదును, 3కోట్లు విలువచేసే 11.92కిలోల బంగా రాన్ని సీజ్ చేసామన్నారు. లైసెన్స్ కలిగిన 615మంది నుండి 534 ఆయుధాలను డిపాజిట్ చేసుకున్నామని, మిగిలిన ఆయు ధాలను ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు బ్యాంకుల వద్ద పనిచేసే సెక్యూరిటీ వద్దే ఉంచామన్నారు. పార్టీ టిక్కెట్లను, ఏకగ్రీవా లను వేలంలో గాని, తీరప్రాంతాలలో దురాయి ద్వారా గాని నిర్ణయిస్తే అలాంటి వారిపై ఎన్నికల నిబంధన ఉల్లంఘన క్రింద చర్యలు తీసుకుంటామన్నారు.

## 26న పెన్షనర్స్ సంక్షేమ భవన్ ప్రారంభం

నెల్లూరు జిల్లా పెన్షనర్స్ సంక్షేమ భవనం ఈనెల 26వతేదీ ప్రారంభం కానుంది. నెల్లూరు భక్తవత్సలనగర్‌లో అత్యంత అధునాతనంగా నిర్మించిన ఈ భవనానికి పెన్షనర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు పి.యస్.రామానుజాచారి పేరు పెట్టడం జరిగింది. 26వ తేది బుధవారం ఉదయం 8.50గంటలకు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ భవనాన్ని ప్రారంభిస్తారు. అలాగే భవన ఆవరణంలో నిర్మించిన కీర్తిశేషులు పి.యస్.రామాను జాచారి కాంస్య విగ్రహాన్ని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు టి.గోపాలకృష్ణ ఆవిష్కరిస్తారు. ఈ సందర్భంగా జరుగుసభకు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పి.మోహన్‌రావు అధ్యక్షత వహిస్తారని, ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన 45వేల మంది పెన్షనర్స్ పాల్గొననున్నారని పెన్షనర్స్ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి టి.కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఎన్నికల ఖర్చు వివరాలను అందించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

నెల్లూరు జిల్లా పరిషత్ సిఇఓ ఛాంబర్‌లో ఎన్ని కల నిబంధనలపై రాజ కీయ పార్టీల ప్రతినిధు లతో ఈనెల 15న జరి గిన సమావేశంలో కలెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం 230-ఏ సెక్షన్ క్రింద స్థానిక సంస్థలలో పోటీచేయు అభ్యర్థులు నామినేషన్ వేసిన తేది నుండి ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తేదీ వరకు అభ్యర్థులు చేసిన ఖర్చులన్నింటిని సక్రమంగా జిల్లా ఎన్నికల కేంద్రానికి పంపాలన్నారు. ఈ ప్రక్రియలో వివిధ రకాలుగా ఖర్చుచేసే వివరాలకు రోజువారి రిజిస్టర్ నిర్వహించాలన్నారు. పోటీచేయు అభ్యర్థులు తాము నిర్వహించిన ఖర్చుల లెక్కల నకలును ఎన్నికల ఫలితం ప్రకటించిన 45రోజులలోగా జిల్లా ఎన్నికల అధికారికి సమర్పించాలన్నారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ప్రకారం జడ్‌పిటిసి సభ్యుని ఎన్నికకు 2లక్షలు, మరియు యంపిటిసి సభ్యుని ఎన్నికకు లక్ష రూపాయలు మాత్రమే ఖర్చుచేయవచ్చన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు రాజకీయపార్టీలు మరియు పోటీచేయు అభ్యర్థులు తమ ప్రచార కార్యక్రమాలపై ఖర్చుచేసే వివరాలను పూర్తిస్థాయిలో ఎలాంటి తప్పులు లేకుండా అందించాలన్నారు. లేనిచో తప్పని రుజువైతే నిబంధనల మేరకు రద్దుచేయడం జరుగు తుందన్నారు. ఎన్నికలు సజావుగా స్వేచ్ఛగా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు తమవంతు సహకారం అందించాలన్నారు.

పోలింగ్ ప్రక్రియ బ్యాలెట్ పత్రాల ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రేఖారాణి, జడ్‌పి, సిఇ జితేంద్ర, బీజేపీ ప్రతి నిధులు ఆంజనేయరెడ్డి, కాళేశ్వరరావు, వివిధ పార్టీలకు చెందిన ప్రతి నిధులు పాల్గొన్నారు.

# బి.పి పెంచిన బి-ఫారం వ్యవహారం

నెల్లూరు నగరపాలకసంస్థ ఎన్నికల్లో 29వ డివిజన్ నుండి తెలుగుదేశంపార్టీకి అధికారిక అభ్యర్థి లేకుండా పోయారు. దీనికి కారణం అభ్యర్థులు దొరక్క కాదు. అభ్యర్థులు ఎక్కువ కావడం వల్ల అక్కడ సమస్య వచ్చింది. 29వ డివిజన్ నుండి తెలుగుదేశం అభ్యర్థులుగా కిలారి తిరుపతి నాయుడు, దొడ్డపనేని రాజానాయుడు, బసివిరెడ్డి మనోహర్‌రెడ్డి(మైథిలి స్కూల్), కిలారి జగదీష్‌లు నామినేషన్‌లు వేసారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కిలారి కోసం, ఆదాల ప్రభాకర్‌రెడ్డి రాజా కోసం పట్టు బట్టారు. విద్యావంతుడుగా పేరున్న మైథిలి మనోహర్‌రెడ్డి అటు ఆదాల, ఇటు సోమి రెడ్డి... ఇద్దరి వద్దా ప్రయత్నించారు. 18వ తేదీ బి-ఫారాలు సమర్పించడానికి చివరి గడువు. 29, 34డివిజన్‌లలో అభ్యర్థుల విషయం తేలకపోవడంతో ముందుగా నగరఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, నగర, రూరల్ ఇన్‌ఛార్జులు కోటం రెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడులు కార్పొరేషన్ ఆఫీసుకు వెళ్లి 52డివిజన్‌లకు బి-ఫారాలు ఇచ్చారు. కొంతసేపటికి 34వ డివిజన్ అభ్యర్థిని కూడా తేల్చారు. 29వ డివిజన్ అభ్యర్థి విషయంలో చివరివరకు హైడ్రామా నడి చింది. నామినేషన్‌లు వేసిన ఎవరూ వెనక్కి తగ్గకపోవడంతో పంచాయితీ చంద్ర బాబు వద్దకు చేరింది. చంద్రబాబు ఆదాల ప్రభాకర్‌రెడ్డికి ఫోన్ చేసి వాకబుచేసారు. ఆదాల రంగంలో వున్న తిరుపతినాయుడు, రాజా, మనోహర్‌రెడ్డిల పరిస్థితిని వివరిం చాడు. ఒక సీటు కూడా రెడ్డి వర్గానికి ఇవ్వకపోవడం, మనోహర్‌రెడ్డి గురించి తెలిసి వుండడంతో ఆయనకే బి-ఫారం ఇవ్వమని చంద్రబాబు చెప్పేసాడు. ఆదాల ఈ విషయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్రకు చెప్పారు. వెంటనే బీద రవిచంద్ర, మనోహర్‌రెడ్డికి ఫోన్‌చేసి బి-ఫారం తీసుకెళ్లాలని చెప్పాడు. బి-ఫారం కోసం వెళ్లిన మనోహర్‌రెడ్డి పార్టీ ఆఫీసువద్దే గంటకుపైగా కాపుకాసాడు. ఎవరూ బి-ఫారం ఇవ్వలేదు. ఈలోపు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డిలు బి-ఫారం తీసుకుని గాంధీనగర్‌లోని పోలింగ్ కేంద్రం వద్దకెళ్లారు. ఓ పక్క ఎన్నికల అధికారి గడువు ముగియనుందని చెపుతున్నా వీళ్లు బి-ఫారం చేతిలో పెట్టు కుని అక్కడ కూడా పంచాయితీ పెట్టారు. ఆ సమయంలో కూడా ఎవరూ వెనక్కి తగ్గలేదు. దీంతో గడువు అయిపోయింది. చంద్రబాబు సూచించిన పేరుతో బి-ఫారం ఇచ్చివుంటే 29వ డివిజన్‌లో పార్టీ అభ్యర్థి రంగంలో ఉండేవాడు. కాని వీళ్లు చేతిలో పెట్టుకుని కూడా బి-ఫారం ఇవ్వకపోవడం వల్లే ముగ్గురు ఇండిపెండెంట్లుగా బరిలో ఉండిపోవాల్సి వచ్చింది.

# నెల్లూరు కబుర్లు

## షర్మిల పర్యటన సక్సెస్



జిల్లాలో వైకాపా నాయకురాలు షర్మిల మున్సిపల్ ఎన్నికల ప్రచార యాత్ర దిగ్విజయంగా సాగింది. 17వ తేదీన ఆమె జిల్లాలోకి ప్రవేశించారు. మర్రిపాడు వద్ద వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నేతలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. షర్మిల 17 నుండి 20వ తేదీ వరకు ఆత్మకూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు, కావలి మున్సిపాల్టీలలో, నెల్లూరు కార్పొరేషన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. షర్మిల సభలకు ప్రజలు భారీఎత్తున తరలివచ్చారు. షర్మిల ప్రచారంతో వైకాపా అభ్యర్థుల్లో ఉత్సాహం పెరిగింది.

## ఛీర్‌ఫుల్‌గా రత్నం కిడ్స్ కలర్‌ఫుల్ డే



నెల్లూరు దర్గామిట్ట సరస్వతీ నగర్‌లోని డా॥ కిషోర్స్ రత్నం కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇటీవల 'కలర్‌ఫుల్‌డే' పేరుతో విద్యార్థులకు రంగుల ప్రపంచాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పసుపురంగు దుస్తులు ధరించడమే కాకుండా పసుపు బెలూన్స్, చార్ట్స్, పుష్పాలు, ఆట వస్తువులు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న స్కూలు డైరెక్టర్స్ డా॥కృష్ణకిషోర్స్ వాసంతి కిషోర్‌లు చిన్నారులను అభినందించారు. ఈ సందర్భంగా డా॥కృష్ణకిషోర్ మాట్లాడుతూ తెలుపు శాంతికి, ఎరుపు శక్తికి, నీలిరంగు నిశ్శబ్దానికి, ఆకుపచ్చ సుభిక్షానికి, ముదురు నీలం తెలివికి, నారింజ ఆనందానికి, పింక్ అందానికి సంకేతాలని వాటి ఆవశ్యకతను చిన్నారులు గ్రహించేలా ఈ "కలర్‌డే"లను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పట్టుబడ్డ నగలు

సోమవారం రాత్రి పోలీసు తనిఖీలలో 11కిలోల 900 గ్రాముల బంగారు ఆభరణాలు పట్టుబడ్డాయి. నగరంలోని ఇరుకళల పరమేశ్వరి గుడి వద్ద 1వ నగర సిఐ శ్రీనివాసరావు వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ ఇన్నోవాలో వీటిని తిరుపతికి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇవి ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ ఆధీనంలో ఉన్న ఆభరణాలుగా తేలింది. కొందరు వ్యక్తులు వీటిని కుదువబెట్టారు. వీటికి లెక్కపత్రాలు చూపించి తీసుకెళ్లమని చెప్పి పోలీసులు వాటిని ట్రెజరీలో అప్పగించారు.

## ఏ.సి మార్కెట్‌లో తనిఖీలు

నెల్లూరులోని ఏ.సి కూరగాయల మార్కెట్‌లో జిల్లా తూనికలు కొలతల శాఖ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ముద్రలు లేని కాటాలను గుర్తించి వాటిని సీజ్ చేసారు. అలాగే పలువురు వినియోగదారుల వద్దనున్న కూరగాయలను తీసుకుని మళ్లీ తూకం వేయగా తేడాలొచ్చాయి. తూనికల్లో తేడాలు వస్తే కఠినచర్యలు తప్పవని వ్యాపారులను అధికారులు హెచ్చరించారు. ఈ తనిఖీలలో తూనికలు కొలతల శాఖ సహాయ నియంత్రకులు ఆర్.ప్రభుకుమార్, జిల్లా ఇన్స్‌పెక్టర్ మల్లేశ్వరరావు, నెల్లూరు ఇన్స్‌పెక్టర్ కెవిఎస్ రామకృష్ణ, గూడూరు ఇన్స్‌పెక్టర్ సయ్యద్‌సలీంలు పాల్గొన్నారు.

## చెల్లాచెదురైన ఓట్లు

నెల్లూరు నగరపాలకసంస్థ ఎన్నికలకు సంబంధించి విడుదలచేసిన ఓట్ల జాబితా గందరగోళంగా ఉందని, దీనిని వెంటనే సరిదిద్దాలని కోరుతూ తెలుగుదేశంపార్టీ నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి సోమవారం కలెక్టరేట్ అదనపు జేసీ ఆర్.ఎస్.రాజ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ ఓటర్ల జాబితా ప్రకారం చూస్తే కుటుంబంలో నలుగురు మనుషులుంటే నలుగురూ నాలుగు డివిజన్లలో ఓటర్లుగా ఉన్నారన్నారు. ఒక ప్రాంతంలో ఉంటున్న వ్యక్తి అక్కడ పోటీ చేస్తున్న అభ్యర్థులకు కాకుండా ఇంకెక్కడికో పోయి ఇంకో ప్రాంతంలో నిలబడ్డ వారికి ఓట్లేయాల్సి వస్తుందన్నారు. ఈ ఓటర్ల జాబితా ప్రజలను తీవ్ర గందరగోళానికి గురిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా ఈ ఓటర్ల జాబితాను సరిచేసి ఏ డివిజన్‌లో ఓట్లు ఆ డివిజన్‌లో ఉండేలా చేయాలని ఆయన ఆ వినతిపత్రంలో కోరారు.

ఈ కార్యక్రమంలో కిలారి వెంకట స్వామినాయుడు, ధర్మవరం సుబ్బారావు, కిన్నెరప్రసాద్, భువనేశ్వరప్రసాద్, కృష్ణమూర్తి, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో షటిల్‌కోర్టు

నెల్లూరులోని జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును 17వ తేదీ అదనపు జేసీ ఆర్ఎస్ రాజ్ కుమార్, జిల్లా రెవెన్యూఅధికారి నాగేశ్వరరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ ఇద్దరితో పాటు ట్రైనీ కలెక్టర్ వర్షిణి, ఏఓ రమేష్‌నాయుడులు కొద్దిసేపు సరదాగా షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు.

## కాంగ్రెస్‌కు 'అల్లం' దూరం



నెల్లూరు నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అల్లం నరేంద్ర యాదవ్ తన పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసారు. 19వ తేదీ నెల్లూరులో షర్మిల సమక్షంలో ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇందిరమ్మ ఫేస్-2లో 50వ డివిజన్‌లో 600 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయించామని, ఆరేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ స్థలాలు చూపలేదని దీనికి వివేకానే కారణమని ఆరోపిస్తూ ఆయన కాంగ్రెస్‌ను వీడారు.

## ఉచిత వైద్యశిబిరం

స్వర్గీయ డాక్టర్ వి.యస్.రెడ్డి ప్రథమ వర్థంతిని పురస్కరించుకుని ఈనెల 18వ తేదీన నెల్లూరు, విజయమహల్‌గేటు వద్ద గల వి.యస్.రెడ్డి మైండ్ అండ్ బ్రెయిన్ సెంటర్ నందు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. దాదాపు వందమంది రోగులను పరీక్షించి వారికి అవసరమైన మందులు, పండ్లు ఉచితంగా పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మైండ్ అండ్ బ్రెయిన్ సెంటర్ స్పెషలిస్ట్ డాక్టర్ ఐఎల్ఎన్ రెడ్డి, రేడియోలజిస్ట్ డాక్టర్ వి.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా ఇస్కాన్‌లో గౌరపూర్ణిమ



శ్రీ కృష్ణుని కలియుగ అవతారమైన శ్రీ చైతన్య మహాప్రభు సందర్భన దినమైన గౌర పూర్ణిమ రోజు నెల్లూరు ఇస్కాన్ మందిరంలో వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు కీర్తనలు, భజనలు, హారతులు, సుఖదేవస్వామి ఉపన్యాసములతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందంతో, భక్తిపారవశ్యంతో తన్మయులయ్యారు. మందిర నిర్వాహకులు స్వామికి సమర్పించిన 108ప్రసాదాలను భక్తులందరికీ పంపిణీ చేసారు.

## ఘనంగా హోలీ



సోమవారం నగరంలో హోలీ వేడుకలు వైభవంగా జరిగాయి.

కాలేజీలు, పాఠశాలల్లో విద్యార్థులు రంగులు చల్లుకుంటూ ఈ వేడుకలలో పాల్గొన్నారు. ముఖ్యంగా మార్వాడీలు నివాసముండే మండపాల వీధి, ఆచారివీధి, చిన్నబజార్ ప్రాంతాలలో ఒకరికొకరు రంగులు పూసుకుంటూ ప్రజలు ఆనందోత్సాహాలతో గడిపారు.

## నగరంలో మూగజీవి

సోమవారం నెల్లూరు వేదాయపాలెం జ్యోతినగర్ 3వ వీధిలో పాడుబడిన బావిలో ప్రాణాపాయస్థితిలో వున్న దుప్పిని ఉమామహేష్ అనే స్థానిక యువకుడు కాపాడాడు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు దీనిని ఎక్కడినుండో తెచ్చి ఎందుకోసమో తీసుకెళుతూ, ఎక్కడ తమను పట్టుకుంటారోననే భయంతో ఈ బావిలో పడేసారు. స్థానికులు బావిలో వున్న దుప్పిని చూసి అటవీశాఖాధికారులకు సమాచారమిచ్చారు. వాళ్లు క్రేన్‌తో అక్కడకు చేరుకున్నారు. ఈలోపు ఉమామహేష్ బావిలోకి దిగి దుప్పిని బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించాడు. ఈలోపు క్రేన్ రావడంతో దాని సాయంతో దుప్పిని బయటకు తీసారు. మూగజీవి పట్ల మానవత్వం చూపి దానిని కాపాడడానికి కృషి చేసిన ఉమామహేష్‌ను అందరూ అభినందించారు.

## రెయిన్‌బో స్పెక్ట్రం - 2014




నెల్లూరు మాగుంటలేఅవుట్‌లోని రెయిన్‌బో స్కూలులో ఇటీవల స్పెక్ట్రం-2014 కార్యక్రమంలో ప్రత్యామ్నాయ వనరుల శాస్త్రవేత్త డా॥జగదీష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ స్పెక్ట్రంలో ఒక్క సైన్సు ప్రాధాన్యతనివ్వడంకాక పిల్లలలో నిగూఢమైన సహజ ప్రతిభకు అద్దంపట్టేలా పలు అంశాలు చోటుచేసుకోవడం హర్షణీయమన్నారు. స్పెక్ట్రంలో సైన్సు మోడల్స్, మ్యాథ్స్ ఫజిల్స్, సోషల్ సబ్జెక్టుకు సంబంధించి హిమాలయ పర్వతాల నమూనా దోమల నివారణకు ప్రకృతి వనరులు, సంప్రదాయ నృత్యాలు, విలువాధారిత విద్యకు సంబంధించిన అంశాలు విద్యార్థులు ప్రదర్శించారు. ప్రదర్శనలను విద్యార్థుల తల్లిదండ్రులూ, పలువురు పురప్రముఖులు సందర్శించారు. పిల్లలు సృజనాత్మకతను తెలియపరిచే వివిధ అంశాలు 27గదులలో ఏర్పాటుచేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ అరుణా స్వయంప్రభ, పాఠశాల డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


మీ జ్ఞాపకాలను ఊపిరిగా చేసుకొని జీవిస్తూ...

శ్రద్ధాంజలి



మీ నిండైన చిరునవ్వు.. కల్లకపటం లేని మనస్సు
మీ స్వచ్ఛమైన ప్రేమాభిమానాలు
మేము జన్మజన్మలకు మరువలేము
మీ జ్ఞాపకాలు మా హృదయాలలో
ఎప్పటికీ బ్రతికే ఉంటాయి

శ్రీమతి కల్లికాట్ విజయలక్ష్మి గారు
తేది 27.02.2014న స్వర్గస్తులైనారు.
వారి పవిత్రాత్మకు శాంతిని చేకూర్చాలని
భగవంతుని ప్రార్థిస్తూ... శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భర్త: గోపాలకృష్ణ(గోపి)
కుమార్తె : మోనికా స్వాతి అత్తగారు: శ్రీమతి పద్మావతి
కుమారులు: విజయకృష్ణ, వంశీకృష్ణ
మరియు కుటుంబసభ్యులు

# వైకాపా వైపు వలస



జగన్ నాయకత్వంపై నమ్మకంతోనే నాయకులు, కార్యకర్తలు భారీగా వచ్చి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్నారని సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పొదలకూరు మండలం తోడేరులోని కాకాణి నివాసంలో ఆయన సమక్షంలో నావూరు మాజీసర్పంచ్ బొడ్డు నరసింహులునాయుడు, పాశం భాస్కర్‌యాదవ్, మన్నవరపు శ్రీనివాసులు, పాశం పెంచలయ్య, అబ్బూరు మాల్యాద్రి, పంచేటి పెంచలనరసయ్య, ఎస్.కె.మీరాసాహెబ్ తదితరులు వైకాపాలో చేరారు.

ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ కాంగ్రెస్, తెలుగుదేశంపార్టీల నుండి భారీగా వలసలు వస్తున్నాయన్నారు. ఇతర పార్టీలలో ఉన్నవారిని తానెప్పుడూ ప్రత్యర్థులుగా చూసానేగాని రాజకీయ శత్రువుగా చూడలేదన్నారు.

సింహపురి సమాచారం

# తేదేపా? భాజపా..?

## పనబాక చూపు ఏవైపు



గూడూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ పనబాక కృష్ణయ్య పక్కచూపులు మొదలుపెట్టినట్లుగా తెలుస్తుంది. కాంగ్రెస్‌లో ఉన్నా, కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి రూపాయి ఖర్చుపెట్టినా దండగేననే ఉద్దేశ్యంతో ఆయనున్నారు. కాంగ్రెస్‌వాళ్లు మాత్రం ఆయననే అభ్యర్థిగా నిర్ణయించుకుని ఉన్నారు. ఆయన మాత్రం మునిగిపోతుందని తెలిసిన పడవలో ఏరుదాటాలనుకోవడం ఎందుకనుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్‌ను వదిలి ఏ పార్టీలోకి వెళ్లాలనేదానిమీద మంతనాలు జరుపుతున్నట్లు తెలుస్తుంది.

తెలుగుదేశంలో చేరితే గూడూరు టిక్కెట్ వచ్చే పరిస్థితి లేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌గాని ఆయన కొడుకుగాని పోటీ చేసే అవకాశాలున్నాయి. సూళ్లూరుపేటలో పరసారత్నంను మార్చవచ్చంటున్నారు. సూళ్లూరుపేట సీటు ఇచ్చే పనయితే పనబాక ఆ పార్టీలో చేరొచ్చు. అయితే ఈ సీటు కావాలంటే అక్కడ వేనాటి రామచంద్రారెడ్డి, గంగా ప్రసాద్‌లను ముందుగా ప్రసన్నం చేసుకోవాల్సి ఉంటుంది. కృష్ణయ్యకు తిరుపతి లోక్‌సభ స్థానం మీద కూడా మనసుంది. తెలుగుదేశం, బీజేపీలకు పొత్తు కుదిరితే, బీజేపీలో చేరి ఆ పార్టీ టిక్కెట్ మీద ఇక్కడ నుండి పోటీ చేయాలనే ఆలోచన కూడా ఉంది. ఒకవేళ టీడీపీ టిక్కెట్ ఇచ్చినా పోటీకి దిగవచ్చు. ఈ రెండు పార్టీలలో పిలిచి ఎవరు సీటిచ్చినా పోటీకి కృష్ణయ్య సిద్ధంగానే ఉన్నాడు. ఇప్పుడుంటున్న కాంగ్రెస్ నుండి మాత్రం పోటీ చేయడం అనుమానమే!

# ఓట్ల గుర్తింపుకు వెబ్‌సైట్

## కీలకంగా పనిచేస్తున్న నాగేశ్వరరావు

నెల్లూరు నగరపాలకసంస్థ ఓటర్ల జాబితా చాలా గొందర గోళంగా వుంది. తన ఓటు ఏ డివిజన్‌లో ఉందో తెలుసుకోవడానికే ఓటరుకు ఒక ఏడాది పట్టొచ్చు. లేదంటే ప్రతి ఓటరు కూడా ఓటరుకార్డు పట్టుకుని ఆనం వివేకానందరెడ్డి దగ్గరకు పోతే ఎవరి ఓటు ఎక్కడనేది ఆయనన్నా చెప్పాలి. ఎవరి ఓటు ఏ డివిజన్‌లో ఉందో తెలియని పరిస్థితుల్లో, ఓటర్లకు డివిజన్, పోలింగ్‌బూత్‌కు సంబంధించిన సమాచారాన్ని సులభంగా అందించేందుకు కలెక్టరేట్‌లోని కాల్‌సెంటర్ ఉద్యోగి వై.నాగేశ్వరరావు ఓ కొత్త వెబ్‌సైట్‌ను రూపొందించారు.

www.spsnellore.com అనే వెబ్‌సైట్‌లోకి వెళితే నెల్లూరు నగరపాలక సంస్థ -2014 ఓటర్ల జాబితా తెరచుకుంటుంది. దాని ప్రోగ్రాంలో ఓటరుకార్డు నెంబర్‌ను గాని, లేదంటే ఓటరు పూర్తిపేరును గాని టైప్ చేస్తే సదరు ఓటరుకు సంబంధించిన పూర్తి సమాచారం వస్తుంది. డివిజన్, పోలింగ్‌బూత్ నెంబర్, పోలింగ్‌స్టేషన్‌తో సహా అన్ని వివరాలు తెలుస్తాయి. దీనివల్ల పూర్తి స్థాయిలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశముంటుంది. ఓటర్ల జాబితా గందరగోళంలో వున్న ఓటర్లకు ఒక మంచి మార్గాన్ని అందించిన నాగేశ్వరరావుకు 'లాయర్' అభినందనలు.

# దేశంలోకి మారిన దళాధిపతి



రాజన్నదళం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీజడ్పీటీసీ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి ఈ నెల 18వతేదీన తెలుగుదేశం పార్టీలో చేరారు. కావలిలోని ఆయన స్వగృహంలో ఆయన పార్టీ మార్పే కార్యక్రమం జరిగింది. చిరంజీవిరెడ్డిని పార్టీలోకి తీసుకు రావడంలో ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి కీలకపాత్ర పోషించారు. చిరంజీవిరెడ్డి రాకను స్థానిక నాయకులు వ్యతిరేకించినప్పటికి ఆదాల, బీద రవిచంద్ర, బొల్లినేని రామారావులు వారికి సర్దిచెప్పారు.

కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅనుచరుడిగా చిరంజీవిరెడ్డి ఆయనతో పాటే వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరారు. అయితే చిరంజీవిరెడ్డిని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డితో పడకుండా వచ్చింది. కలిగిరి మండలంలో చిరంజీవిరెడ్డికి వ్యతిరేక వర్గాన్ని మేకపాటి ప్రోత్సహించసాగారు. దీంతో సహకార ఎన్నికలలో చిరంజీవిరెడ్డి సొంత ప్యానెల్‌ను పెట్టి గెలిపించుకున్నాడు. దీనికి పర్యవసానంగా చిరంజీవిరెడ్డిని ఆయన అనుచరులను పార్టీ నుండి సస్పెండ్ చేసారు. ఆ తర్వాత చిరంజీవిరెడ్డి రాజన్నదళం పేరుతో పార్టీ పెట్టి ఉదయగిరి నియోజకవర్గంలో మేకపాటికి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించసాగారు. ఇప్పుడు ఆదాల చొరవతో తెలుగుదేశంలో చేరారు. చిరంజీవిరెడ్డి చేరికతో ఉదయగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం మరింత బలం పుంజుకుందని చెప్పొచ్చు.

# ఈదూరు సైకిల్ సవారీ

## ముత్తుకూరులో టీడీపీకి గత వైభవం



తాను ఏ పార్టీలో ఉన్నా ముత్తుకూరు మండల రాజకీయాలను ఒంటిచేత్తో శాసిస్తాడనే పేరున్న మాజీ మండలాధ్యక్షుడు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి తిరిగి తెలుగుదేశంపార్టీలో చేరారు. సోమవారం అల్లీపురంలోని తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇంట్లో ఆయన తెలుగుదేశంలో చేరడం జరిగింది. ఆయనతో పాటు మరికొందరు కాంగ్రెస్‌నాయకులు కూడా తెలుగుదేశంలో చేరడం జరిగింది.

ఈదూరు సోదరులకు తెలుగుదేశంపార్టీ మాతృసంస్థ. ఈదూరు రామకృష్ణారెడ్డి తెలుగుదేశంపార్టీ నుండే ఎమ్మెల్యేగా గెలిచారు. ఈదూరు రామ్మోహన్‌రెడ్డి మండలాధ్యక్షుడిగా చేసారు. ముత్తుకూరు మండలంలో ఈదూరు సోదరులకు మాస్‌లీడర్లుగా పేరుంది. 1994, 1999 ఎన్నికలలో సర్వేపల్లి నియోజకవర్గం నుండి పోటీచేసిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విజయంలో ఈదూరు కీలకపాత్ర పోషించారు. 2004ఎన్నికలప్పుడు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లోచేరారు. 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి గెలుపుకు కృషి చేసారు.

ఇప్పుడు రాష్ట్రంలోనే కాంగ్రెస్ ఎత్తిపోయింది. కాంగ్రెస్‌లో ఉన్న నాయకులు వైకాపా, తెలుగుదేశంలలో దూరిపోతున్నారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా తెలుగుదేశంలో చేరిపోయారు. ఈదూరు రామ్మోహన్‌రెడ్డి మొదట వైకాపా వైపు చూసారు. కాని అక్కడ ఇప్పటికే దూరినవారికే సందులేకపోవడంతో తాను చేరడం దండగనుకున్నాడు. అందుకే తెలుగుదేశం వైపు వెళ్లాడు. ఈదూరు చేరికతో ముత్తుకూరు మండలంలో టీడీపీకి గత బలం తిరిగొచ్చినట్లే!

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



అమ్మ...!

ప్రేమకు ప్రతిరూపం అమ్మ
ఆప్యాయతకు మారుపేరు అమ్మ
అనురాగానికి అర్థంచెప్పేది అమ్మ
ఆదరించి అక్కున చేర్చుకునేది అమ్మ

శ్రీమతి కొర్రపాటి తులశమ్మ

ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

తనకిక అమ్మ లేదన్న చేదు నిజంతో
శోకసముద్రంలో వున్న
"రత్నం మాష్టారు" కి
వారి కుటుంబసభ్యులకు
మనోస్థైర్యాన్ని కలిగించాలని దైవాన్ని ప్రార్థిస్తూ...

తుంగా రాజగోపాలరెడ్డి చారిటబుల్ ట్రస్ట్
నెల్లూరు.

# రాహుల్ బ్రహ్మచర్యంపై సీబీఐ విచారణ



ఢిల్లీలోని టెన్‌జనపథ్ వద్దకు రాయల్‌ఎన్‌ఫీల్డ్ బైక్‌పై వి. హెచ్.హనుమంతురావు బుల్లెట్ వేగంతో దూసుకువచ్చాడు. మనిషి చాలా ఆవేశంతో ఉన్నాడు. ఎదురుగా ఎవరొచ్చినా కొట్టేసేంత కసితో ఉన్నాడు. బైక్‌కు సైడ్‌స్టాండ్ వేసి బైక్ హ్యాండిల్ మీదుగా కూడి కాలు తిప్పి దిగాడు. నేరుగా లోపలకు వెళ్లాడు. అక్కడ అప్పటికే సోనియా, రాహుల్‌తో పాటు 'పెళ్లిళ్ల, పెటాకులు' మ్యారేజ్‌బ్యూరోకు చెందిన ఓ పెళ్లిళ్ల ఏజెంట్ ఉన్నారు. చాలామంది అమ్మాయిల ఫోటోలు చేతిలో పెట్టుకుని సోనియా, రాహుల్ చూస్తున్నారు. ఫోటోల్లోని అమ్మాయిలలో మన దేశానికి సంబంధించిన అమ్మాయిలే కాక విదేశాల అమ్మాయిలు వారిలో దక్షిణాఫ్రికా, వెనిజులా, జింబాబ్వే, ఉగాండ, రుగ్మేనియా, టాంజానియా వంటి నీగ్రోజాతి దేశాల అమ్మాయిల ఫోటోలు కూడా ఉన్నాయి. మ్యారేజ్ బ్యూరో ఏజెంట్ ఉండి... ఇంత అర్జెంట్‌గా అబ్బాయికి సంబంధాలు ఎందుకు చూస్తున్నారమ్మా అని అడిగాడు. అందుకు సోనియా... ఇది లోకం కదా నాయనా... ఇంకా పెళ్లి చేయకపోతే నలుగురూ నాలుగు విధాలుగా అనుకుంటారు. అదీగాక పెళ్లయితేగానీ వీడు ప్రధాని అయ్యేటట్లు లేదు. వచ్చిన కోడలు కాలుపెట్టే వేళావిశేషాన్ని బట్టి కూడా ఉంటుంది కదా అని చెప్పింది. అందుకతను... అలాగయితే మన దేశం అమ్మాయితో కాదు, విదేశీ అమ్మాయితో పెళ్లి జరిపిద్దాం... ప్రధాని అయ్యే ఛాన్సుంటుం దన్నాడు. అంత గ్యారంటీగా ఎలా చెప్పగలవని సోనియా అడిగింది. మిమ్మల్ని చేసుకున్నాకే కదా రాజీవ్‌గాంధీ ప్రధాని అయ్యారని అతను చెప్పాడు. ఈ లాజిక్ ఏదో బాగానే వుందని సోనియా అంటుండగా అక్కడకు విసురుగా వి. హెచ్ వచ్చాడు. రావడంతోటే రాహుల్‌గాంధీ చేయి పట్టుకుని బరబరా లాక్కుంటూ బయటకెళ్లాడు. అది చూస్తూ సోనియా విస్తుపోయింది. వి. హెచ్ నేరుగా రాహుల్‌ను తీసుకెళ్లి తన బండి ఎక్కించాడు. ఎక్కడకు పోతున్నావని రాహుల్ అడుగుతున్నా వి. హెచ్ పట్టించుకోకుండా బైక్‌ను స్టార్ట్ చేసి ఢిల్లీ వీధుల్లో వంది కిలోమీటర్ల వేగంతో పోనివ్వసాగాడు. అలా వెళ్లి నేరుగా ఓ హాస్పిటల్ ముందు ఆపాడు. రాహుల్ ఆసుపత్రి బోర్డు వైపు చూసాడు. డాక్టర్ 'అమరం' సెక్సాలజిస్ట్ అని దానిమీద వ్రాసి వుంది. రాహుల్ గుండె గత్తుక్కుమంది. అతనిలో టెన్షన్ పెరగసాగింది. ఓ పక్క అమ్మ పెళ్లి సంబంధాలు చూస్తుంటే ఇతను ఈ టైంలో ఇక్కడకు తీసుకొచ్చాడేంటి... నాకు తెలియకుండా నాలో ఉన్న లోపాన్ని ఈయనేమైనా పసిగట్టాడా, లేక ఇంతకాలం పెళ్లి చేసుకోనందుకు నా మీద ఏదైనా అనుమానమొచ్చిందా అని సందేహించసాగాడు. ఇక ఎక్కువసేపు ఉండబట్టలేక... నన్ను ఈ డాక్టర్ వద్దకెందుకు తీసుకొచ్చావ్... అని రాహుల్ అడిగాడు. కడుపు మండిపోతోంది బాబు అని వి. హెచ్ అన్నాడు. కడుపు మండిపోతుంటే గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ దగ్గరకో, జనరల్ ఫిజీషియన్ దగ్గరకో పోవాలి గాని సెక్సాలజిస్ట్ వద్దకు రావడమెందుకని రాహుల్ ప్రశ్నించాడు. అప్పుడు వి. హెచ్... నా కడుపు మంట అదికాదు బాబూ... ఆ పవన్‌కల్యాణ్ నిన్నెంత మాటన్నాడో చూసావా... పార్టీ పెట్టుకునే వాడు పెట్టుకోకుండా నీతో ఏం పని... అతను మూడు పెళ్లిళ్లు చేసుకున్నాడు. నేను దానినే ఎత్తి చూపాను. నిన్న పార్టీ పెట్టేటప్పుడు అతను నిన్నేమన్నాడో తెలుసా... పెళ్లి చేసుకోనంత మాత్రాన మీ రాహుల్ బ్రహ్మచారి అని నిరూపించగలరా? అని సవాల్ విసిరాడు. నువ్వు బ్రహ్మచారివని నే నిరూపిస్తాను. ఈ డాక్టర్ వద్ద మీకు పరీక్షలు చేయించి, ఆయనిచ్చే 'మిస్టర్ క్లీన్' సర్టిఫికేట్ తీసుకుని ఆ పవన్‌కల్యాణ్ మొహాన కొడతాను. ఓ గంట కోఆపరేట్ చేయండని అడగసాగాడు. ఈ వి. హెచ్ తన కొంప ముంచే పని పెట్టుకున్నాడని గ్రహించిన రాహుల్ అక్కడనుండి టెన్‌జనపథ్‌కు పరుగులు తీసాడు.

★★★★★

టెన్‌జనపథ్‌లో వి. హెచ్ పంచాయితీ పెట్టాడు. చుట్టూ ఆంటోని, చిదంబరం, దిగ్విజయ్‌సింగ్, దాసరి జైరాంరమేష్, మనీష్ తివారి, కపిల్ సిబల్, సల్మాన్ ఖుర్షీద్, కమల్‌నాథ్ కూర్చుని వున్నారు. వి. హెచ్ వారితో... ఆ పవన్ కల్యాణ్ మన రాహుల్‌బాబును ఎంత మాటన్నాడో తెలుసా... మన రాహుల్ పెళ్లి కాకపోయినా బ్రహ్మచారి కాదంట... అవునోకాదో చెప్పగలరా అని మనల్నే అడుగుతున్నాడు. మన రాహుల్‌బాబుకు రోజూ అదే పనా... పాపం ఆయన పార్టీ కోసం, మన కోసం పెళ్లి కూడా చేసుకోకుండా అతను కాళ్లు ముడుచుకుని పడుకుంటుంటే ఆ పవన్ కల్యాణ్ చూడండి... మన రాహుల్ బ్రహ్మచారి కాదు, ఆయనకు నిద్రలేచింది అదే పని అన్నట్లు మాట్లాడుతున్నాడని చెప్పసాగాడు. దూరం నుండి అది విన్న రాహుల్... ఆ పవన్ ఒకసారి అంటే ఈ ముసలోడు దానిగురించి ప్రపంచమంతా చెప్పేట్టున్నాడని మనసులో బాధపడసాగాడు. వి. హెచ్ మాత్రం దానిని ఆపకుండా రాహుల్ బ్రహ్మచారో కాదో తేల్చడానికి సిబిఐ ఎంక్వయిరీ చేయించాలని, ఎలాగూ సిబిఐ వాళ్లు మనమే రిపోర్ట్ అడిగితే అదిస్తారు కాబట్టి, రాహుల్ బ్రహ్మచారని అనే రిపోర్ట్‌ను తీసుకుని ఆ పవన్ కల్యాణ్‌కు బుద్ధిచెప్పాలని డిమాండ్ చేసాడు. మిగతా అందరూ కూడా సోనియా వద్ద ఇదే డిమాండ్ చేయాలని తీర్మానించారు.

★★★★★

సోనియా, మన్మోహన్‌సింగ్‌ల వద్దకు వీళ్లంతా చేరారు. వాళ్లవద్ద కూడా వి. హెచ్ పాతపాటే పాడి రాహుల్ బ్రహ్మచర్యంపై సిబిఐ విచారణ కోరాడు. అసలు రాహుల్‌ను అనాల్సిన అవసరం పవన్ కల్యాణ్‌కేమొచ్చిందని అడిగింది. అప్పుడు సర్వే సత్యనారాయణ లేచి... మీ మీద కోపంతో రాహుల్‌ను అన్నాడు మేడమ్ అని చెప్పాడు. నా మీద కోపంతో రాహుల్‌ను అనడమేంటి... అసలేం జరిగిందని సోనియా అడిగింది. అప్పుడు సర్వే సత్యనారాయణ చెప్పసాగాడు. ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసాక తన అన్న చిరంజీవి ఢిల్లీలో చక్రం తిప్పుతుంటాడని పవన్ కల్యాణ్ భావించాడు. చిరంజీవి వస్తే ప్రధాని, మీరు నిల్చుంటారని, ఆయన ఏది చెబితే మీరది చేస్తుంటారని ఊహించాడు. తన అన్న పరపతి ఏ స్థాయిలో పనిచేస్తుందో చూద్దామని పవన్ ఒకరోజు నేరుగా టెన్‌జనపథ్‌కు వచ్చాడు. బయట ఆయనకు చిరంజీవి కనిపించలేదు. లోపల సోనియాతోనో, రాహుల్‌తోనో మాట్లాడుతుంటాడులే అనుకున్నాడు. అంతలో వి. హెచ్. హనుమంతరావు లోపల నుండి బయటకొచ్చాడు. తన అన్న చిరంజీవి ఏం చేస్తున్నాడని పవన్ ఆయన్ను అడిగాడు. చిల్లరసామాన్లు తేవడానికి ప్రొవిజన్‌షాపు కెళ్లాడని వి. హెచ్ చెప్పాడు. ఆ మాటతో పవన్ దిమ్మ తిరిగింది. ఏపిలో హీరోలా తిరిగిన తన అన్న చిరంజీవిని ఢిల్లీలో జీరోలా మార్చిన కాంగ్రెస్ మీద, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీల మీద కసితీర్చుకోవాలనుకున్నాడు. అందుకే సొంతంగా పార్టీనిపెట్టి కాంగ్రెస్‌పార్టీని దేశం నుండి తరిమికొట్టాలని పిలుపునివ్వడంతో పాటు రాహుల్ శీలాన్ని శంకించే విధంగా మాట్లాడాడు అని చెప్పాడు. అది విని వి. హెచ్... అయ్యో నా నోటిదూల ఎంత పని చేసింది, పవన్ కల్యాణ్ వచ్చినప్పుడు చిరంజీవి చిల్లరకొట్టుకు వెళ్లాడని చెప్పకుండా ఉండుంటే ఈరోజు మీ శీలాన్ని శంకించే పరిస్థితి వచ్చుండేది కాదు కదా అని ఏడవసాగాడు. వి. హెచ్ చేస్తున్న పబ్లిసిటీ చూసి రాహుల్ తలను గోడకేసి కొట్టుకోసాగాడు.

## కదంబం

### 'విజయమహల్ గేటు'

లోహితుడు,
8688933160.

వెల్తురు నెమ్మదిగా చీకటిగా చివురించటం
చీకటి చివురుల నుంచి పుట్టల్లోకి జారుకుంటున్న
చీమల్లా
మనుషులు యంత్రాలై పరుగు తీయటం...
అన్నీ నిత్యం కనిపించే దృశ్యాలే...


ఆ గేటు మీది నుంచి...
ఆకలిగా వెళ్ళు లేదా ఆఖరి నడకగావెళ్ళు
నువ్వెలా వెళ్ళినా
నీవెంట ప్రవహించే పరిమళమొకటి వస్తుంది

సన్నగా.. జాలిగా దండలు దండలుగా
తెలతెల్లగా లోపలి కుళ్ళంతా తెల్లబోయేలా
చల్లటి జలపాతమై నాసికలోంచి
దేహంలోకి దుముకుతుంది

అవసరం లేదు అన్నా
అనవసరం అనుకున్నా
నిలువునా నిలబడిపోక తప్పని స్థితి ఆవరిస్తుంది
అరచేతి కొస నుంచి మోచేతి దాకా కొలిచి
ఊపిరిని కొలిచే సాధనమన్నట్లు
ముచ్చటగా చేమాకులో చుట్టబెడతారు...
సంచిలో వేసినా
సవరించి తలలో తురుమినా
నిలువునా పరిమళ స్నానమే...
మునెమ్మ ఆసుపత్రి నుంచి
బైపాసు మలుపు దాకా
జయప్రదమ్మ ఆసుపత్రి నుంచి
కొత్తహాలు దాకా
పరిమళపు వంతెనపైన నడిచినట్టే...
వాళ్ళు రూకలతో ఆకలిని కొలుస్తారు
మనం కొసరి కొసరి కోరికలను జయిస్తాం.
ఉదయం నుంచి సిమెంటు అరక్యాలైన వీధుల్లో
ఎన్నిసార్లు మరణించినా
ప్రతి సాయంత్రం విజయమహల్‌గేటు దగ్గరే
నెల్లూరు మళ్ళీ... మళ్ళీ... బతికేస్తున్నదేమో
అనిపిస్తుంది.

అక్కడికి రాగానే
నాకూ బతికున్నానని గుర్తొస్తుంది
నాకే కాదు ఎవరికైనా
అక్కడే బతుకుదామా అనిపిస్తుంది
నాల్గు మూరల పవిత్ర పరిమళాన్ని
వెంటబెట్టుకు వెళ్ళగలమా అనిపిస్తుంది

## జ్యోత్స్నకు పెరసం ఉగాది పురస్కారం



రానున్న ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 23న నెల్లూరు పురమందిరంలో ఉగాది కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని పెన్నారచయితల సంఘం ప్రధాన కార్యదర్శి గోవిందరాజుల సుభద్రాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జయనామ ఉగాది పురస్కారాన్ని హైదరాబాద్‌కి చెందిన కవయిత్రి జ్యోత్స్న ఫణిజకు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా రసజ్ఞులైన సాహితీప్రియులను వారు ఆహ్వానిస్తున్నారు.

## రామకృష్ణారావుకు జమున పురస్కారం

హైదరాబాద్‌కు చెందిన సీనియర్ కవి వై.రామకృష్ణారావును సోమిరెడ్డి జమున స్మారక పురస్కారంతో సత్కరించారు. ఆదివారం నెల్లూరులోని ఐఎంఏహాల్‌లో జరిగిన ఈ సన్మానసభలో ముఖ్యఅతిథిగా సినీరచయిత, నటులు తనికెళ్ల భరణి పాల్గొన్నారు. పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో డా॥ పెళ్ళకూరు జయప్రద ఈ పురస్కారంతో ఆయన్ను సత్కరించారు. కోక విమలకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెరసం కార్యదర్శి జి.సుభద్రాదేవి, వ్యవస్థాపక అధ్యక్షులు మోపూరు పెంచలనరసింహం, నరేంద్ర, అవ్వారు శ్రీధర్‌బాబు, కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## చెంగాళమ్మ గుడిలో ఉగాది వేడుకలు

సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానం నందు ఈ నెల 31వ తేదీన నూతన తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆరోజు అమ్మవారు స్వర్ణకిరీటధారణ, చందనాలంకారంతో దర్శనమిస్తారన్నారు. ఉదయం 9.30గంటలకు లక్షకుంకుమార్చన, సాయంత్రం 5గంటలకు పంచాంగశ్రవణం జరుగుతుందని మాగుంట కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరిస్తారని ఆయన వెల్లడించారు.

## బ్రాహ్మణులను గౌరవించే వారికే ఓటు

బ్రాహ్మణులను గౌరవించే పార్టీలకే మద్దతునివ్వాలని విశాఖ పట్టణం శ్రీ శారదా పీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్రస్వామి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా బ్రాహ్మణ సేవాసమాఖ్య ఆధ్వర్యంలో నెల్లూరురూరల్ దేవరపాలెం వద్ద వున్న వేద గాయత్రి అగ్రహారంలో 516మంది దంపతులతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్వామి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ విజయం సాధిస్తుందో తనకు తెలుసని, అయితే ముందుగా చెబితే వివాదాస్పదమవుతుందని అందుకే చెప్పడం లేదన్నారు. ప్రజారాజ్యం పార్టీ కనుమరుగవుతుందని, తెలంగాణ ఏర్పాటవుతుందని గతంలోనే చెప్పానన్నారు. హిందువులను, బ్రాహ్మణులను గౌరవించే పార్టీలనే ఆదరించాలని ఆయన పిలుపునిచ్చారు. బ్రాహ్మణులను, బ్రాహ్మణ సంప్రదాయాలను కొన్ని పార్టీలు అవహేళన చేస్తున్నాయని ఆ పార్టీలకు బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. అన్యమత ప్రచారాన్ని శారదాపీఠం వ్యతిరేకిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణసేవాసమాఖ్య జిల్లా అధ్యక్షులు గుడ్లదొన వాసుదేవరావు, కార్యదర్శి కామేశ్వరప్రసాద్, స్వయంపాకుల శ్రీనివాసులు, రాళ్లపల్లి రామసుబ్బారావు, ఉల్చి భువనేశ్వర్‌ప్రసాద్, డాక్టర్ వై.నాగదేవి ప్రసాద్, కె.సురేష్, కె.దయాశంకర్, మాచవోలు రాజశేఖరశర్మ, మాచవోలు రమేష్, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్‌కు వాక్సిన్



ఈ నెల 16వ తేదీ నెల్లూరు ఏ.సి స్టేడియంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీగవర్నర్ డాక్టర్ కె.అంకిరెడ్డి, జోనల్ ఛైర్‌పర్సన్ ఎన్.బలరామయ్య నాయుడు ఆధ్వర్యంలో వాకర్స్‌కు హెపటైటిస్–బి వ్యాక్సిన్ వేసే కార్యక్రమం జరిగింది. 165మంది వాకర్స్‌కు వ్యాక్సిన్‌లు వేసారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షులు పి.దయాకర్‌రెడ్డి, బి.శేషగిరిరావు, టి.నారాయణరావు, డి.రమణయ్య, పి.రవిచంద్ర, ఎస్ఎం బాషా, ఎం.ఎస్.రెడ్డి, జి.ఓబులరెడ్డి, సత్యనారాయణ, కె.తిరుపతినాయుడు, సుందరరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

చేసే పనులందు పొరపాట్లు జరిగి ఆటంకాలు కలగవచ్చు. కాబట్టి జాగ్రత్త అవసరం. చిన్న విషయాలకు కూడా టెన్షన్ పడుతుంటారు. సోదరవర్గానికి మంచి జరుగుతుంది. వారం చివర రోజులలో అవసరాలకు ఋణం చేయడం, మూలధనం వాడుకొనడం జరుగ వచ్చు. వృత్తిపరంగా బాగా పురోగతి ఉంటుంది. వ్యాపారాభివృద్ధికి అవకాశాలు దొరుకుతాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

పలుకుబడి కొరకు, మొగమాటాలకు ఎక్కువ డబ్బు వ్యయం చేస్తారు. మాట తీరు, వ్యవహారాలలో తొందర పాటు తగ్గించుకొనండి. కుటుంబసభ్యుల అనుమతి, సహకారంతో కార్యక్రమాలు, నిర్ణయాలు తీసుకొనండి. దైవసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారవర్గాలకు అధికారుల దాడులుండవచ్చును.వృత్తిపరంగా బాగా వ్యాపకం పెరిగి ఆదాయం అందుతుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థికస్థితి గతులను గూర్చి చర్చించుకుంటారు. వృత్తి వ్యాపారాలలో ఆర్థికస్థితి ఆదాయం బాగుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసుకొంటే మంచిది. యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. లభించిన ఆర్థిక వ్యాపార అవకాశాలపై నిర్ణయం తీసుకొనలేని స్థితి ఉంటుంది. ముఖ్యపత్రాలు, వస్తువులు, డబ్బును జాగ్రత్తగా కాపాడుకొనండి. కుటుంబసౌఖ్యం బాగుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వృత్తి ఉపాధి రంగాల వారికి అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు మంజూరుకాగలవు. కొత్త పెట్టుబడులకు, నూతన వ్యాపారాలకు ప్రయత్నాలు సాగుతాయి. వ్యాపారవర్గాలకు రాబడి పెరుగుతుంది. ఉద్యోగులు పబ్లిక్‌తోను అధికారులతోను జాగ్రత్తగా మెలగండి. మిత్రులు సహచరుల వల్ల సమస్యలు రాకుండా చూచుకొనాలి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 21.03.2014 నుండి తేది. 27.03.2014 వరకు ఈ వారం మేషంలో కేతువు, మిథునంలో గురువు, తులలో రాహు శనికుజులు, 25వతేది నుండి కన్యలో వక్రకుజుడు, మరకంలో శుక్రుడు, కుంభంలో బుధుడు, మీనంలో రవి, వృశ్చిధనుర్మకరములలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

### ముహూర్తములు లేవు

### ఫాల్గుణ మాస కృష్ణ పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 21 | శుక్ర | పంచమి | రా॥గ౦9.35వ॥ |
| తేది. 22 | శని | షష్ఠి | రా॥గ౦7.59వ॥ |
| తేది. 23 | ఆది | సప్తమి | సా॥గం.6.08వ॥ |
| తేది. 24 | సోమ | అష్టమి | సా॥గం.4.00వ॥ |
| తేది. 25 | మంగళ | నవమి | ప॥గం.1.42వ॥ |
| తేది. 26 | బుధ | దశమి | ప॥గం.11.18వ॥ |
| తేది. 27 | గురు | ఏకాదశి | ఉ॥గం.8.52వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వ్యవహారాలలో మీ మాటకు విలువ, నిర్వహణ సామర్థ్యం బాగుంటుంది. వృత్తి జీవనంలో వ్యాపకం, రాబడి బాగుంటుంది. కొత్త పెట్టుబడులకు, కొత్త వ్యాపారాలకు అవకాశాలు లభిస్తాయి. ఆర్థికముగా బాగుండి ఆదాయం పెరుగుతుంది. పెండింగ్‌లో పనులు సవ్యంగా సాగుతాయి. దూరము నుండి ఆహ్వానాలు అందుకొనడం, దైవకార్యములలో పాల్గొనడం జరుగుతుంది.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

చేపట్టిన పనులను సమర్ధవంతంగా నెరవేరుస్తారు. పారిశ్రామిక యాజమాన్యాలకు వ్యాపారవర్గాలకు ఆర్థికాభివృద్ధి అవకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తులు ఏర్పరచుకొనే ప్రయత్నాలు జరుగుతాయి. స్త్రీలకు కొద్దిపాటి అనారోగ్య బాధలుంటాయి. గృహవస్తు వాహనరిపేర్లు ఖర్చులు పైన బడగలవు. షేర్ మార్కెట్ నిరుత్సాహపరుస్తుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపార ఉపాధి పథకాలలో పుంజుకుంటారు. ఆదాయం కూడా పెరుగుతుంది. మంచి పనులకు, పలుకుబడి పెంచుకొనడానికి అదనపు ఖర్చులుంటాయి. పిల్లల కారణంగా కొంత పేచీలుండి సర్దుబాటుకాగలవు. స్థిరాస్తులుకొనే ప్రయత్నాలు సాగుతాయి. క్రొత్త వ్యాపారాల ఆలోచనలు, పెట్టుబడుల ఆలోచనలు చేస్తారు. ఋణాలు, పన్నులు చెల్లింపులు జరుపుతారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆర్థిక నిర్ణయాలలో తొందరపడవద్దు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉంటుంది. ఆదాయముకు లోపంలేకున్నా ఖర్చులు పెరుగుతాయి. సొంత పనులు వ్యవహారాలు అనుకున్న విధంగా సాగుతుంటాయి. కోర్టు వ్యవహారాలు వాయిదాపడతాయి. బంధువర్గం నుండి అనారోగ్య వార్తలు వింటారు. దైవకార్యాలలో కళా, సేవారంగాలలో పాల్గొంటారు. ఆరోగ్యం ఫరవాలేదు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కొత్త పథకాలు ప్రణాళికలతో వ్యాపారవర్గాలు ముందుకు సాగుతాయి. వృత్తిపరంగా ప్రతిభ చూపుతారు. ఆర్థిక ఒప్పందాలలో మెలకువ ప్రదర్శించండి. పనులు వ్యవహారాలు స్వయంగా పర్యవేక్షించడం మంచిది. గృహ నిర్మాణాలు, రిపేర్లు నిదానంగా సాగుతాయి. వస్తు వాహన రిపేర్లుంటాయి. బుధగురువారాలలో ఆరోగ్యం ఇబ్బంది కలిగించవచ్చు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వ్యవహారాలలో దూకుడు, మాటల జోరు తగ్గించుకొనండి. అనుకున్న పనులకు ఆటంకాలుంటాయి. కాబట్టి ప్రశాంతంగా ఉండటం అవసరం. గృహ వస్తు వాహనరిపేర్లుంటాయి. షేర్ల విషయంలోను, భాగస్వామ్య పెట్టుబడుల విషయంలో జాగ్రత్త అవసరం. ఉద్యోగులకు బాధ్యతలు పెరగడం, ప్రభుత్వ అధికారుల వత్తిడి ఉంటుంది. డబ్బు, ఆర్థిక వ్యవహారాలలో మెలకువగా ఉండండి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అనుకున్న పనులు సవ్యంగా నిదానంగా సాగడం వల్ల టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం ఉంటుంది. ఖర్చులు బాగా పెరిగినా ఆర్థిక ఇబ్బందులను తట్టుకుంటారు. అవసరాలకు ఋణాలు చేస్తారు. మొగమాటాలకు, పలుకుబడికిగాను ఇతరులకు ఆర్థిక సహాయం చేస్తారు. కుటుంబ వ్యవహారాలలో అనుకూలత తక్కువ. శుభకార్య నిర్ణయాలు జరుగుతాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

క్రీడా, కళా, సాంకేతిక రంగాల వారికి గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. వ్యాపార ఉపాధి రంగాలలో పెరుగుదలకు అనుకూల స్థితి, ఆదాయవృద్ధి ఉంటుంది. నిర్ణయాలను ధైర్యంగా తీసుకొంటారు. శుభవార్త వింటారు. కమిటీలు సమావేశాలలో ప్రాముఖ్యత వహిస్తారు. బంధువర్గంతో సామరస్య స్థితులు నెలకొంటాయి. ఉద్యోగులకు విశేష అధికార బాధ్యతలు పైనబడగలవు.

### నెల్లూరు కార్పొరేషన్ పై...

# వై.యస్.ఆర్.కాంగ్రెస్ జెండా రెపరెపలాడుతుంది

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 20వ డివిజన్‌కు చెందిన టెక్కెమిట్టలో ఈనెల 15న వైస్సార్సీపీ కార్యాలయాన్ని నెల్లూరు రూరల్ కో ఆర్డినేటర్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర కోఆర్డినేటర్ డా॥పోలుబోయిన అనీల్ కుమార్‌యాదవ్, వై.యస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీ మేయర్ అభ్యర్థి అబ్దుల్ అజీజ్ ప్రారంభించారు.



వైయస్సార్సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డా॥ అనీల్‌యాదవ్

కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ దివంగత మహానేత వై.యస్.ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రం ప్రశాంతంగా సంక్షేమ రాజ్యంతో అభివృద్ధి పథంలో నడిచిందని కాని మహానేత వై.యస్. మరణించిన అనంతరం రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిలా తయారైందని అన్నారు. కాంగ్రెస్, తెలుగు దేశం పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు సాగిస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేశాయని నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోయాయని, చార్జీల భారంతో ప్రజలు అల్లాడుతున్నారని సంక్షేమ పథకాలు ఆగిపోయాయని అన్నారు. మళ్ళీ రాష్ట్రంలో అన్నివిధాల అభివృద్ధి చెందాలంటే వై.యస్ జగన్మోహన్‌రెడ్డి లాంటి మాటతప్పని మడమతిప్పని సమర్ధ నాయకుడు ముఖ్య మంత్రికావాలని అందుకు ప్రతి వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సైనికుడిగా పనిచేయాలని కోరారు. జరగబోయే స్థానిక ఎన్నికల్లో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌పై వై.యస్.ఆర్.కాంగ్రెస్ జెండా రెపరెపలాడబోతుందని వై.యస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీ సంపూర్ణ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

కార్యక్రమంలో 20వడివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి బత్తిన శోభన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్‌లు తాటి వెంకటేశ్వరరావు, రూప్‌కుమార్‌యాదవ్, మందా బాబ్జీ, అమీర్‌జాన్, కరీమ్, రియాజ్, అలీమ్, సుభహాని, ఖలీల్, రాఘవ, కమతం అశోక్, అనీల్, బాబు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ ఎన్నికలకు ఏర్పాట్లు షురూ!



నెల్లూరులోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డి.ఆర్.ఓ ఛాంబర్‌లో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో ట్రెయినీ జె.సీ ఎండి.ఇంతియాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో పోటీ చేసేందుకు దాదాపు 656మంది అభ్యర్థులు నామినేషన్లు వేయడం జరిగిందన్నారు. అలాగే 9మంది రిటర్నింగ్ అధికారులు, 9మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. 20వతేదీ నుండి ఓటర్లకు ఓటరు స్లిప్‌లు అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. 21 మరియు 25తేదీలలో పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. 443ఇవియంలు సిద్ధంగా వుంచామన్నారు. పోలింగ్ సిబ్బంది, మెటీరియల్‌ను తరలించేందుకు 30బస్సులను, 12 మినీ వాహనాలు, ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. సమావేశంలో డిఆర్‌డిఓ ఎస్‌వి నాగేశ్వరరావు, సంపత్‌లు పాల్గొన్నారు.

# సైకిల్ వితరణ

లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు పినాకిని సేవా కార్యక్రమంలో భాగంగా ఈనెల 16న నెల్లూరు సంతపేటలోని ఓబయ్య బడి ఆవరణంలో ఓ పేద మహిళకు సైకిల్ వితరణ చేసారు. లయన్ పైడిమర్రి శ్రీ రంగనాథ్ పెళ్ళిరోజు సందర్భంగా వితరణ చేయడంతో రంగనాయకులపేటలో నివసిస్తూ దూరప్రాంతాలలో కొన్ని ఇళ్ళలో వంటపని చేసుకుని బ్రతుకుతున్న మహిళకు సహాయంగా వుంటుందని సైకిల్ పంపిణీచేసామని క్లబ్ ప్రెసిడెంట్ బైసాని పార్ధసారధి తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి బయ్యా ప్రసాద్, ట్రెజరర్ టి.వి.రాంప్రసాద్, సభ్యులు ఆర్.రమేష్, డి.సునీల్‌బాబు, అంజలి, కల్పనలు పాల్గొన్నారు.

# అమరజీవికి భారతరత్న ఇవ్వాలి



అమరజీవికి నివాళులర్పిస్తున్న కె.వి.చలమయ్య

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని ఈనెల 16న నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండు వద్దగల ఆయన విగ్రహానికి అంతర్జాతీయ వైశ్య సమాఖ్య ఉపాధ్యక్షులు కె.వి.చలమయ్య కార్యదర్శి తిరివీధి ప్రకాశరావు, రైల్వే విని యోగదారుల సంఘం మాజీ అధ్యక్షులు బి.వి.కృష్ణమూర్తి, అవోపా కార్యదర్శి బాబూరావు తదితరులు పుష్పమాల అలంకరించి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా కె.వి.చలమయ్య మాట్లాడుతూ శ్రీ పొట్టి శ్రీరాములు 58రోజుల నిరాహారదీక్ష ఆత్మబలిదాన ఫలితంగానే భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని, కాని ఈరోజు నిరుద్యోగ రాజకీయ నాయకుల కుట్రలతోనే రాష్ట్రం విడిపోయే ప్రమాదం వచ్చిందని పేర్కొన్నారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసిన రాజకీయ నాయకులు, ఈరోజు పొట్టి శ్రీరాములు 113వ జయంతిని తలపెట్టకపోవడం శోచనీయమని, 58సంవత్సరాలుగా శ్రీ పొట్టి శ్రీరాములుకు భారతరత్న ఇవ్వాలని, ఆయన కాంస్య విగ్రహం అసెంబ్లీలో, చిత్రపటాన్ని పార్లమెంటులో పెట్టాలని, ఆయన జయంతి, వర్ధంతులను సెలవు దినాలుగా ప్రకటించాలని ఎన్నిసార్లు కోరినా ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు.



## స్థలములు & ఇల్లు అమ్మబడును

భవానినగర్, కోవూరులో DTCP హైదరాబాద్ వారి అనుమతి పొందిన లే అవుట్ నందు అన్ని వసతులతో, అన్ని ఫేసులలో ఇండ్ల ప్లాట్లు మరియు ఒక డూప్లెక్స్ హౌస్ నార్త్ ఈస్ట్ కార్నర్ తూర్పు ఫేసింగ్ కలది అమ్మకమునకు కలవు.

కావలసినవారు సంప్రదించండి :

94415 23251, 99892 87971.

# కళ్యాణ వైభవం...!



ప్రముఖ వాస్తు నిపుణులు వాస్తు రామచంద్ర - వరలక్ష్మిల కుమారుడు సతీష్ చంద్ర - కళ్యాణి (సర్వేపల్లి సుబ్రహ్మణ్యం-దేవసేనల కుమార్తెల వివాహం ఈ నెల 19వ తేదీ నెల్లూరులోని కిలారి తిరుపతి నాయుడు కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# రంగరంగ... వైభవంగా రథోత్సవం



నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 18వ తేదీన రంగడి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మేళతాళాలు, మంగళవాయిద్యాలతో, బాణాసంచా మోతలతో, జై రంగ శ్రీ రంగ అంటున్న భక్తుల నినాదాల మధ్య రంగనాథుడు శ్రీదేవి, భూదేవితో కలిసి శోభాయమానంగా అలంకరించిన రథంపై వూరేగారు. ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి రథంపై వేంపు చేసారు. ఉదయం 9గంటలకు రథోత్సవం మొదలైంది. మొదట రంగనాయకులపేట రైల్వేగేటు వరకు వెళ్లి, తిరిగి గోపురంవీధి నుండి సంతపేట నాలుగుకాళ్ల మండపం వరకు వచ్చింది. దారిపొడవునా భక్తులు ముగ్గులు వేసి, స్వామికి హారతులిచ్చి టెంకాయలు కొట్టారు. శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఇక్కడ వేంచేయగా ఎదురుకోలు ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. నరసింహస్వామి తరపున రంగనాయకులస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం రథం తిరిగి దేవస్థానం వద్దకు చేరుకుంది.

రథోత్సవంలో ఎటువంటి అపశృతులు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసారు. వివిధ స్వచ్ఛంధ సంస్థలు, ధార్మిక సంస్థలు, భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ, మంచి నీళ్ల పంపిణీ చేసాయి. అనారోగ్య కారణంగా రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఈ వేడుకలకు హాజరు కాలేకపోయారు. తెలుగుదేశంపార్టీ మేయర్ అభ్యర్థి డాక్టర్ జడ్.శివప్రసాద్, వైకాపా అభ్యర్థి అబ్దుల్ అజీజ్‌లతో పాటు వివిధ రాజకీయపార్టీల నాయకులు ఈ రథోత్సవంలో పాల్గొన్నారు.

# ఘనంగా కవిత్రయ జయంత్యుత్సవాలు





ఈ నెల 13, 14, 15తేదీలలో నెల్లూరు టౌన్‌హాల్లో జరిగిన కవిత్రయజయంత్యుత్సవాలలో 'నన్నయ్య కవితాతత్వం', 'ఎఱ్ఱన కవితా వైదుష్యం', 'తిక్కన కవితా వైభవంపై' ఉపన్యసించి కవిత్రయజయంతి సంఘం తరపున సత్కారాలు స్వీకరించిన ఉపన్యాసకులు ఆచార్య కె.జి.కృష్ణమూర్తి, ఆచార్య కె.వి.రాఘవాచార్య, కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళైలు.

# డాక్టర్ జడ్ఎస్‌కు ఐఎంఏ మద్దతు

నెల్లూరు నగరపాలకసంస్థ ఎన్నికలలో తెలుగుదేశంపార్టీ మేయర్ అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ జడ్.శివప్రసాద్‌కు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నెల్లూరుశాఖ మద్దతు తెలిపింది. ఐఎంఏ జాతీయ కమిటీ డామన్ డిక్లరేషన్ ప్రకారం జిల్లాశాఖ నిర్ణయం తీసుకుంది. ఎక్కడ ఏ స్థాయి ఎన్నికలలోనైనా ఒకే వైద్యుడు పోటీలో ఉంటే పార్టీలతో ప్రమేయం లేకుండా ఆ వైద్యుడికి ఐఎంఏ మద్దతునిస్తుంది. ఈమేరకే నగరంలోని వైద్యులు, వారి కుటుంబసభ్యులు డాక్టర్ జడ్.శివప్రసాద్ గెలుపుకు సహకరించాలని ఐఎంఏ నెల్లూరు శాఖ కోరింది.

## కాలధర్మం

# కొర్రపాటి తులశమ్మ



రాష్ట్రంలోనే కోచింగ్‌సెంటర్ అన్న పదానికి శ్రీకారం చుట్టి 1984నుండి ఈరోజు వరకూ తన విజయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న "రత్నం" విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నంకి జన్మనిచ్చిన ఆయన మాతృమూర్తి శ్రీమతి కొర్రపాటి తులశమ్మ మార్చి 15వతేది శనివారం మధ్యాహ్నం కన్నుమూశారు. తన 94వయేట కన్నుమూసిన ఆమెకు ఒక కుమారుడు ఇద్దరు కుమార్తెలు వున్నారు.

విద్యకు చిరునామాగా మారిన హరనాథపురంలో అధికశాతం తులశమ్మ బంధువర్గమే వుంటున్నారు. రత్నం విద్యాసంస్థల ద్వారా ఒక మహా విద్యాసామ్రాజ్యాన్ని నిర్మించిన తన కుమారుడి నీడకే ఆమె తన బంధువర్గాన్ని మొత్తం చేర్చేసింది. ముఖ్యంగా ఆమె సొంత వూరు చలపనాయుడుపల్లె నుండి నెల్లూరుకు ఎవరొచ్చినా తులశమ్మ ఆతిథ్యం ఇవ్వాల్సిందే. తన కోసం తన కొడుకు కట్టించిన ఇంట్లో బసతో పాటు వారికి భోజన సదుపాయాలు కూడా చేసి వారిని సంతృప్తిపరచి త్రిప్పి పంపించడం ఆమెకి ఆనవాయితీ. రత్నం మాస్టారి శ్రీమతి పద్మావతీరత్నం కూడా తన మేనకోడలే కావడంతో అటుఇటు రెండు కుటుంబాల బంధువులకు తులశమ్మ దేవతతో సమానం.

దానగుణం, మంచితనం, క్రమశిక్షణ, ఆప్యాయత, ఆదరణ ఇవన్నీ తన తల్లి తనకు నేర్పిన గుణాలని ఆమె తనకే కాకుండా తన బంధువులేందరికో ఆదర్శమని "రత్నం" సారాంటారు. తన బిడ్డల బంగారు భవిష్యత్తుతో పాటు తన ఆత్మీయుల అందరి జీవితంలో సుఖసంతోషాలతో పరిపూర్ణ జీవితాన్ని గడిపి తులశమ్మ తనువు చాలించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ రత్నం మాస్టారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతుంది "లాయర్"

# సీన్ మారుతోందా?

(మొదటిపేజీ తరువాయి)

అదే సమయంలో చంద్రబాబు పార్టీ తలుపులను బార్లా తెరచి అందరినీ ఆహ్వానించాడు. వాస్తవానికి నెలక్రితం దాకా కూడా తెలుగుదేశంకు చాలాచోట్ల గట్టి అభ్యర్థులు దొరకని పరిస్థితి. కాని ఇప్పుడు ఒక్కో సీటుకు ఇద్దరేసి నాయకులు పోటీ పడుతున్న స్థితి. కాంగ్రెస్ నుండి చాలా మంది గట్టి నాయకులు వచ్చి చేరడంతో తెలుగుదేశంపార్టీకి ఆయా జిల్లాల్లో బలం పెరిగింది. అంతేగాని ఈ బలం పెరిగింది చంద్రబాబును చూసి కాదు. ఉదాహరణకు నెల్లూరుజిల్లానే తీసుకుంటే ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు తెలుగుదేశం పార్టీలో చేరడం వల్ల నెల్లూరు లోక్‌సభతో పాటు నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలలో టీడీపీ అనూహ్యంగా పుంజుకుంది. ఇలాంటి సీన్ సీమాంధ్రలోని ప్రతిజిల్లాలో చోటు చేసుకుంది.

ఇప్పుడు కాంగ్రెస్ కేడర్ అంతా కూడా తెలుగుదేశంలోకి వలసపోయింది. కాంగ్రెస్‌కు తెలుగుదేశంకు పెద్ద తేడా లేదిప్పుడు. కాంగ్రెస్ నుండి వచ్చిన నాయకులతో తెలుగుదేశం ఎంతో కొంత బలపడిందన్నది వాస్తవం. అన్ని జిల్లాల్లోను ఈరోజు తెలుగుదేశం గట్టిపోటీ ఇచ్చే పరిస్థితుల్లో ఉంది. అయితే అనూహ్యంగా వచ్చిన ఈ ఊపు ఒట్టి వాపా లేక బలుపా అనేది తెలియాలంటే కొంతకాలం ఆగకతప్పదు.

# జగన్ బాణం

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్‌కు, దానికి గుడ్డిగా మద్దతిచ్చిన బీజేపీకి, రెండుకళ్ల సిద్ధాంతంతో రాష్ట్ర విభజనకు కారణమైన తెలుగుదేశంపార్టీకి బుద్ధిచెప్పాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజలంతా ఓటేసే ముందు వై.యస్.ను తలచుకోవాలని, ఈ రాష్ట్ర ప్రజలకు ఆయన చేసిన మేలును ఎవరూ మరచిపోలేరన్నారు. దివంగత మహానేత వై.యస్.రాజశేఖరరెడ్డి పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చి ఆయన కొడుకుపై కుట్రపన్ని జైలులో పెట్టిన దుర్మార్గులకు ఓటుతో గుణపాఠం చెప్పాలని ఆమె కోరారు. రాజన్న రాజ్యం కోసం, సంక్షేమ పాలన కోసం జగన్‌ను ఆశీర్వదించండని కోరారు. 64కళలలో అబద్ధాలాడడం ఓ కళ. ఈ కళలో చంద్రబాబు నిష్ణాతుడు. రాష్ట్రానికి సేవచేయడానికే ప్రధానిగా అవకాశం వచ్చినా తిరస్కరించానని అబద్ధాలాడుతున్నాడు. ఆయనకు ప్రధాని పదవిని ఎవరిస్తామన్నారు, ఎప్పుడిస్తామన్నారో చెప్పాలని ఆమె డిమాండ్ చేసారు. వై.యస్ మరణం తర్వాత ఈ రాష్ట్రం అంధకారంలో కూరుకుపోయిందన్నారు. ఆయన ప్రవేశపెట్టిన ఏ ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేసారు. చంద్రబాబు తన కొడుకు లోకేష్ రాజకీయ భవిష్యత్ కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ కుటుంబాన్ని తొక్కేస్తున్నాడని చెప్పారు.

షర్మిల రోడ్‌షోలకు, బహిరంగసభలకు ప్రజలు వేలసంఖ్యలో తరలివచ్చారు. ఆమె రావడం కొన్నిచోట్ల ఆలస్యమైనా ప్రజలు ఓపిగ్గా ఎదురుచూసారు.

ఆమె పర్యటనలో ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా కన్వీనర్ మేరిగ మురళీధర్, తిరుపతి పార్లమెంట్ పరిశీలకులు వరప్రసాద్, సమన్వయకర్తలు మేకపాటి గౌతంరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, పాశం సునీల్‌కుమార్, సిఇసి సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నెల్లూరు మేయర్ అభ్యర్థి అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

# డీల్ కుదిరింది

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ పెట్టడం, బీజేపీతో, టీడీపీతో కలిసి ఎన్నికల్లో ప్రయాణం సాగించడం మీడియా పెద్దమనిషి కుదిర్చిన డీల్‌లో భాగం. ఈ డీల్‌లో వందలకోట్ల వ్యవహారం కూడా దాగున్నట్లు తెలుస్తుంది.

ప్రస్తుతమున్న తెలుగు సినీహీరోలలో అత్యధిక క్రేజ్ వున్న హీరోలు పవన్ కల్యాణ్, మహేష్‌బాబులే! నాకు కొంచెం తిక్కుంది, దానికో లెక్కుంది అన్న పవన్ కల్యాణ్‌ను బీజేపీ, టీడీపీ వాళ్లు బాగా క్యాచ్‌చేసారు. ఆయన తిక్కకు వందల కోట్లతో లెక్కకట్టి తమ వలలోకి లాగేసుకున్నారు.

# కొరవడుతున్న నాయకత్వం

(2వ పేజీ తరువాయి)

కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి కొన్ని డివిజన్‌లలో ప్రాధాన్యతనివ్వాల్సివచ్చింది. నగరఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డికి నగరంలో బలమైన వర్గం ఉంది. రేపు అభ్యర్థి ఆయనే కాబట్టి ఎక్కువ డివిజన్‌లలో అభ్యర్థుల నిర్ణయం ఆయనే తీసుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో తమకు ప్రాధాన్యత కల్పించడం లేదంటూ రమేష్‌రెడ్డి దంపతులు అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. ఇక రూరల్ పరిధిలోని డివిజన్‌లలో చూస్తే పార్లమెంట్‌కు పోటీ చేయాలనుకుంటున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి కొన్ని డివిజన్‌లలో, రూరల్ నుండి పోటీ చేయబోతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొన్ని డివిజన్‌లలో అభ్యర్థులను పెట్టారు. కొన్ని డివిజన్‌లలో ఈ ఇద్దరి మనుషులు నామినేషన్‌లు వేయడంతో వారిని ఉపసంహరింపచేయడానికి జిల్లా అధ్యక్షుడు ఆపసోపాలు పడాల్సి వచ్చింది. మరోపక్క తాను కోరినన్ని సీట్లు ఇవ్వలేదని రూరల్ ఇన్‌ఛార్జ్ కిలారి వెంకటస్వామినాయుడు కినుక వహించి ఉన్నారు.

ఇదంతా కూడా పార్టీ కంటే నాయకులు ముఖ్యమనే రీతిలో వ్యవహరించడం వల్లే జరుగుతుంది. పార్టీలో ఎవరు పని చేసారు, ఎవరు గెలుస్తారనే అంశానికంటే నాయకులు వాటాలేసుకుని సీట్ల పంపకాలు చేసుకున్నందువల్లే జిల్లా పార్టీపై నాయకులు పట్టుకోల్పోయే పరిస్థితి వస్తుంది.

# పోరు మొదలైంది

అలకలు, బుజ్జగింపులు, నామినేషన్ల ఉపసంహరణ, బి–ఫారాల అందజేత వంటి ప్రక్రియ ముగియడంతో పురపోరుకు ఒక క్లారిటీ వచ్చింది. ఏ డివిజన్ లేదా ఏ వార్డులో ఎవరు అభ్యర్థులనే దానిపై ఓటరుకు స్పష్టత వచ్చింది. చాలాచోట్ల అభ్యర్థులు ఏకగ్రీవాల కోసం ప్రయత్నించినప్పటికీ అవి సఫలం కాలేదు. గూడూరులో వైకాపా ఒకటి, నాయుడుపేటలో తెలుగుదేశంకు ఒకటి, సూళ్లూరుపేటలో స్వతంత్ర అభ్యర్థి ఒకరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నెల్లూరుకార్పొరేషన్, మిగిలిన ఆరు మున్సిపాల్టీలలో మొత్తం 1105 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. నెల్లూరులో 54డివిజన్‌లకు 456మంది, కావలిలో 40వార్డులకు 136మంది, గూడూరులో 33వార్డులకు 143మంది, వెంకటగిరిలో 25వార్డులకు 109మంది, సూళ్లూరుపేటలో 23వార్డులకు 100మంది, ఆత్మకూరులో 23వార్డులకు 77మంది, నాయుడుపేటలో 20వార్డులకు 84మంది పోటీలో ఉన్నారు. ఇక పార్టీల పరంగా చూస్తే నెల్లూరులో వైకాపా తరపున 54మంది, తెలుగుదేశం తరపున 53మంది, కాంగ్రెస్ తరపున 54మంది, బీజేపీ నుండి 15మంది, సీపీఎం నుండి 19మంది, సీపీఐ నుండి ముగ్గురు, ఇతరులు 258 మంది రంగంలో ఉన్నారు. కావలిలో వైసిపి 38, తెలుగుదేశం 37, కాంగ్రెస్ 34, బీజేపీ 3, సీపీఎం 2, సీపీఐ 1, ఇతరులు 49 మంది పోటీలో నిలిచారు. వెంకటగిరిలో వైకాపా 22, దేశం 25, కాంగ్రెస్ 24, బీజేపీ 10, సీపీఎం 1, సీపీఐ 3, ఇతరులు 24 మంది బరిలో ఉన్నారు. సూళ్లూరుపేటలో వైకాపా 22, దేశం 21, కాంగ్రెస్ 21, బీజేపీ 4, సీపీఎం 2, సీపీఐ 2, ఇతరులు 28 మంది పోటీలో నిలిచారు. ఆత్మకూరులో వైసిపి 22, తెలుగుదేశం 17, కాంగ్రెస్ 20, బీజేపీ 1, సీపీఎం 1, ఇతరులు 16 స్థానాలలో నిలబడ్డారు. నాయుడుపేటలో వైసిపి 19, టీడీపీ 20, కాంగ్రెస్ 17, బీజేపీ 9, సీపీఎం 3, ఇతరులు 14 స్థానాలలో నిలిచారు. చాలా ఎక్కువ డివిజన్‌లు, వార్డులలో వైకాపా, తెలుగుదేశంపార్టీలో రెబల్స్ బెడదను ఎదుర్కొంటుండగా, కాంగ్రెస్‌వాళ్లు మాత్రం వెదికివెదికి బలవంతంగా అభ్యర్థులను దించాల్సి వచ్చింది.

## నెల్లూరు నగరపాలక సంస్థ డివిజన్ అభ్యర్థులు వీరే...

| డివిజన్ | టీడీపీ | కాంగ్రెస్ | వైసీపీ |
|---|---|---|---|
| 1 | జె.నాగరాజు | వి.లక్ష్మీనారాయణరెడ్డి | లేబూరు పరమేశ్వర్‌రెడ్డి |
| 2 | ఎం.రామ్మూర్తి | కెవి.రమణయ్య | కారుదుంప దశరథరామయ్య |
| 3 | కె.శైలజ | వి.సుభాషిణమ్మ | ఇ.ధనూజ |
| 4 | ఎం.మధు | ఎం.రమణారెడ్డి | ఎం.విజయభాస్కర్‌రెడ్డి |
| 5 | ఎస్.కె.భారతి | ఎం.సుబ్బారావు | ఓ.రవి |
| 6 | వి.లక్ష్మయ్య | ఎస్.షణ్ముగం | ఎం.ద్వారకానాథ్ |
| 7 | కె.ప్రసాద్ | పిఎస్.సుందర్ | పెళ్లూరు శ్రీనివాసులు |
| 8 | జెడ్.శివప్రసాద్ | వై.రంగయ్యనాయుడు | గూడూరు శ్రీధర్‌రెడ్డి |
| 9 | కె.బాలాజీ | కె.మోహన్ | డి.రాజశేఖర్ |
| 10 | డి.మస్తానమ్మ | ఎం.సంపూర్ణమ్మ | బి.అరుణ |
| 11 | పి.శాంతి | వి.సీతమ్మ | ఎం.ధనమ్మ |
| 12 | ఎం.మధుసూదన్‌రెడ్డి | ఏ.రంగమయూర్‌రెడ్డి | మనుబోలు సికిందర్‌రెడ్డి |
| 13 | టి.మస్తాన్ | పి.దేవదాసు | యు.మాధవయ్య |
| 14 | యు.భువనేశ్వరప్రసాద్ | కె.ప్రతాప్‌రెడ్డి | ఎల్.వెంకటేశ్వరరెడ్డి |
| 15 | ఏ.జానకి | కె.సరస్వతమ్మ | జి.సుజాత |
| 16 | పిఆర్.సతీష్‌యాదవ్ | వై.నిరంజన్ | ఏ.బాలకోటేశ్వరరావు |
| 17 | పి.సాయిసుధ | ఎం.బుజ్జమ్మ | యు.మస్తానమ్మ |
| 18 | జి.శారద | కె.పద్మజ | డి.సరోజనమ్మ |
| 19 | ఎన్.సునీత | పి.వీణ | ఎస్.రమాదేవి |
| 20 | డి.రాజేష్ | పి.సురేష్ | పి.శోభన్‌రెడ్డి |
| 21 | ఎన్.మల్లికార్జున్‌యాదవ్ | ఎస్‌కె.ఖాదర్‌బాషా | చేజర్ల మహేష్‌బాబు |
| 22 | బి.శ్రీవిద్య | ఆర్.లక్ష్మీ | ఎం.గౌరీ |
| 23 | పి.పద్మప్రియ | ఎస్‌కె.షర్మిల | జి.అనసూయమ్మ |
| 24 | ఎం.శ్రీప్రియ | ఏ.మనోరమ | పి.శ్రీలక్ష్మి |
| 25 | పి.సునీత | కె.సౌధామిని | వై.ప్రియాంక |
| 26 | బి.చాముండేశ్వరి | కె.శకుంతలమ్మ | పి.ప్రవీణ |
| 27 | ఎం.వెంకటేశ్వర్లుయాదవ్ | ఎం.మధుసూదన్‌రావు | బి.పురుషోత్తం |
| 28 | ఎం.రజనీ | ఎం.పద్మజ | ఆర్.వెంకటజ్యోతి |
| 29 | .......... | కె.రాజేష్ | ఎస్.వెంకటసుబ్బారెడ్డి |
| 30 | ఎస్‌కె.సైదా | ఎస్‌కె.బేగం | పి.మాధవి |
| 31 | పి.అపర్ణ | కె.పద్మజ | టి.అనిత |
| 32 | వి.కనకదుర్గ | డి.సునీత | కె.సంపూర్ణ |
| 33 | సిహెచ్.పద్మావతి | ఎస్‌కె.ఫమిధ | ఎస్‌కె.తాజున్నీ |
| 34 | ఎం.పెంచలయ్య | సిహెచ్.రవిరాజు | వి.నరసింహారెడ్డి |
| 35 | స్వర్ణా వెంకయ్య | టి.బాలసుధాకర్ | వై.ప్రశాంత్‌కిరణ్ |
| 36 | జి.సుజన | సిహెచ్.రాధిక | ఎస్‌కె.వహీద |
| 37 | ఏ.దయాకర్‌గౌడ్ | రవిచంద్ర | బి.శ్రీనివాసరావు |
| 38 | పి.సుశీల | ఐ.రాజురమణమ్మ | కొమరగిరి శైలజ |
| 39 | సిహెచ్.ధనలక్ష్మి | ఎస్.ప్రభావతి | కాకుటూరు లక్ష్మీసునంద |
| 40 | ఏ.ప్రసాద్ | ఎన్.శ్రీలత | పి.రూప్‌కుమార్ |
| 41 | టి.చంద్ర | ఎన్.లక్ష్మీనారాయణ | జి.నాగరాజు |
| 42 | టి.సైదా | సయ్యద్‌ఆసీఫ్‌బేగం | ఎస్‌కె.జలీల్ |
| 43 | ఎస్‌కె.మున్వర్‌బాషా | ఆసీఫ్‌బాషా | ఎండి.ఖలీల్‌అహ్మద్ |
| 44 | పి.సత్యనారాయణ | వై.రవికుమార్ | టి.మురళీకృష్ణ |
| 45 | కె.జ్యోతి | ఎం.మంజుల | పి.హరిత |
| 46 | జి.లక్ష్మి | ఎస్.ఉషారాణి | వి.సుధారాణి |
| 47 | బి.సుజాతారావు | వై.దివ్య | ఎస్.సుభాషిణి |
| 48 | వి.ప్రసూన | ఎస్.కె.టీనా | కె.కృష్ణవేణి |
| 49 | ఎస్.వెంకటమ్మ | వి.నాగవల్లి | వి.పద్మ |
| 50 | బి.భానులక్ష్మి | ఎస్.జయప్రద | ఎం.సుకన్య |
| 51 | డి.భాగ్యవతి | ఏ.శాంతకుమార్ | ఎం.ప్రశాంతకుమార్ |
| 52 | బి.వెంకయ్యయాదవ్ | మునాఫ్ | ఎస్‌కె.అబ్దుల్‌అజీజ్ |
| 53 | సిహెచ్.వెంకటసుబ్బయ్య | డి.వెంకటరమణయ్య | డి.అశోక్ |
| 54 | ఎస్‌కె.షఫియాబేగం | ఎం.సునంద | ఎస్‌కె.సల్మా |



# గూడూరు డివిజన్ వార్తలు

### మున్సిపల్ ఎన్నికల

## నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు



మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల ఘట్టం 16వ తేదీతో ముగిసింది. చివరిరోజు కోలాహలంగా వైఎస్సార్‌సీపీ, టిడిపి, కాంగ్రెస్, బీజేపీ పార్టీల అభ్యర్థులు ర్యాలీగా వచ్చి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త పాశం సునీల్‌కుమార్, పట్టణ కన్వీనర్ నాశిన నాగులు, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. అలాగే టిడిపి తరపున పొనకా శివకుమార్‌రెడ్డి, ఆయన భార్య అయిన దేవసేన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా ర్యాలీలను నామినేషన్ దాఖలు చేసే మున్సిపల్ కార్యాలయానికి దూరంగానే బారికేడ్లు ఏర్పాటుచేసి అక్కడే ర్యాలీలను అడ్డుకున్నారు.

అభ్యర్థులు, బలపరిచే వారిని మాత్రమే లోనికి రానిచ్చారు. దీంతో వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలుచేసి వెళ్లిపోయారు. అలాగే కాంగ్రెస్, బిజేపీ అభ్యర్థులు కూడా భారీ ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. వారి నామినేషన్లను దాఖలు చేశారు.

## పేదలకు ఉచిత వైద్యసేవలు


వృద్ధులను, అనాథలను పరీక్షిస్తున్న డాక్టర్ జనార్థన్‌రెడ్డి, రోహిణి

గూడూరు పట్టణంలోని సాయినగర్, దర్గా వీధి ప్రాంతాల్లో పేదలకు శనివారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. శిరిడి సాయి మందిరంలో సాయి భక్త బృందం ఆధ్వర్యంలో డాక్టర్ జనార్థన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి అనాథ్, పేద వృద్ధులకు వైద్య సేవలు నిర్వహించారు. తదుపరి వారికి దుస్తులు అందజేశారు. ఈ కార్య క్రమంలో సేవాసంస్థ అధ్యక్షుడు హుస్సేన్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే దర్గావీధిలో నూర్ మసీదు ప్రాంతంలో నూర్‌స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో అరవింద ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ వెంకట్, సయ్యద్ షబీర్ పేదలకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు.

## ముత్యాలమ్మ జాతర గోడపత్రిక ఆవిష్కరణ

గూడూరు డివిజన్ చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వేంచేసిన ముత్యాలమ్మ జాతరను ఈనెల 25న నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన ఆహ్వాన గోడ పత్రికను శనివారం ఆలయంలో దేవాదాయశాఖ ఈవో తాతా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ప్రత్యేకంగా శాకాంబరి అలంకారం, 108మండిడోళ్లు, నాదస్వర విద్వాంసులతోలయవిన్యాసం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

25 నుంచి 28వతేదీ వరకు జరిగే జాతరకు వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వరిదిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ఓబ్బాయి, శివకుమార్, సింహాద్రి, మదన్‌మోహన్, సురేంద్ర దువ్వూరు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గూడూరు 33వ వార్డు వైఎస్సార్‌సిపి అభ్యర్థి

## ఏకగ్రీవంగా ఎన్నికైంది


ఎకగ్రీవంగా ఎన్నికైన తాళ్ల సుబ్బమ్మ


గూడూరు 33వవార్డుకు వైఎస్సార్ పార్టీ అభ్యర్థి తాళ్లసుబ్బమ్మ ఏకగ్రీవంగా కైవసం చేసుకొని గూడూరు పురపాలక సంఘంలో తొలి బోణీకొట్టింది. ఈ వార్డులో తాళ్ల సుబ్బమ్మ, రామబత్తిన వాసవి మాత్రమే వైకాపా తరపున నామినేషన్లు దాఖలు చేశారు. ఆదివారం వాసవి నామినేషన్ ఉపసంహరించుకోగా తాళ్ల సుబ్బమ్మ ఎన్నిక ఏకగ్రీవమైంది.

### పురపాలక ఎన్నికల్లో...

## సమర్థులకే కాంగ్రెస్ టికెట్


సమావేశంలో మాట్లాడుతున్న పనబాక కృష్ణయ్య

గూడూరు మున్సిపల్ మండల ఎన్నికలలో కీలకంగా వ్యవహరించనున్నామని గూడూరు మున్సిపల్‌లో కాంగ్రెస్‌పార్టీ తరపున అన్ని వార్డులలో మంచి అభ్యర్థులను నిలబెట్టామని గూడూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పనబాక కృష్ణయ్య అన్నారు. గెలుపునకు సమిష్టిగా కృషిచేద్దామని అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన సోమవారంనాడు మాట్లాడుతూ మండలంలోని అన్ని సెగ్మెంట్లలోనూ, జెడ్పీటీసీ స్థానానికి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులను బరిలో దించినట్లు తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ ద్వారా జరిగిన అభివృద్ధిని చూపుతూ ప్రజలను ఓట్లడిగి పార్టీ అభ్యర్థుల గెలుపుకు సమిష్టిగాకృషిచేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు దువ్వూరు మధుసూదనరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మనుబోలు ప్రసాద్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, జానకిరెడ్డి, జనార్థన్, బుర్లా విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానము**

తూర్పుకనుపూరు గ్రామం, చిల్లకూరు మం॥ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా.

**జాతర మహోత్సవ ఆహ్వానము**

తేది 25.03.2014 నుండి తేది 28.3.2014 వరకు

| తేది/వారము | ఉత్సవ కార్యక్రమములు |
|---|---|
| 25-3-2014 | రాత్రి జాతర ప్రారంభం |
| మంగళవారం | శ్రీ పోలేరమ్మ వారి "నిలుపు" |
| | సాయంత్రం 6.00గంటలకు 108 మంది డోళ్ళు, నాదస్వర విద్వానులచే లయవిన్యాస కచ్చేరి మరియు శ్రీ అమ్మవారి సామూహిక పల్లకీసేవ, పూలంగిసేవ మహోత్సవము అత్యంత వైభవముగా నిర్వహించబడును. మరియు శ్రీ అమ్మవారికి వివిధ రకములైన కూరగాయలు మరియు పండ్లతో శాఖాంభరి అలంకారము చెన్నై వారిచే కలదు. |
| 26.3.2014 | శ్రీ గురునాథస్వామి అంకమ్మ దేవతల గ్రామ ఉత్సవము, |
| బుధవారం | యార, గొల్లల వేడుకలు |
| 27.3.2014 | పగలు శ్రీ గురునాథస్వామి గ్రామ ఉత్సవము |
| గురువారం | రాత్రి అమ్మణ్ణి ఉయ్యాలసేవ |

ప్రతిరోజు సాయంత్రం 7గంటల నుండి సాంస్కృతిక కార్యక్రమములు కలవు.

తేది 28.3.2014 శుక్రవారం శ్రీ పోలేరమ్మను వెళ్ళనంపు ఉత్సవము జరుగును.


శ్రీ వరిదిరెడ్డి రామమోహన్‌రెడ్డి
చైర్మెన్

తాతా శ్రీనివాసరావు
కార్యనిర్వహణాధికారి


మరియు
ధర్మకర్తల మండలి సభ్యులు

# ఉత్తరక్రియలు



మంచిని మానవత్వాన్ని మాకు నేర్పించి, ఆప్యాయతని అనురాగాన్ని మాకు పంచి
క్రమశిక్షణ కార్యదక్షత మాలో పెంచి, మా అభివృద్ధికి స్ఫూర్తిప్రదాతగా నిలచిన

## శ్రీమతి కొర్రపాటి తులశమ్మ గారు

కీర్తిశేషులు కొర్రపాటి ఈశ్వరయ్య నాయుడు గారి సతీమణి
తే.15.03.2014ది శనివారం పరమపదించినారు.

*వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...*

కె.వి.రత్నం - కుమారుడు
కె.పద్మావతి రత్నం - కోడలు

కె.వేణుగోపాల్ - మనుమడు
కె.రమావేణుగోపాల్ - మనుమరాలు
కె.సాయిరోహిత్ - మునిమనుమడు
కె.శివాని - మునిమనుమరాలు

డా॥ కె.కృష్ణకిషోర్ - మనుమడు
కె.వాసంతి కిషోర్ - మనుమరాలు
కె.రోషిణి - మునిమనుమరాలు

## ఉత్తరక్రియలు

వారి ఉత్తరక్రియలు తే.27.03.2014ది గురువారం ఉదయం 11.00గంటలకు
ముత్తుకూరురోడ్డు, శ్రీకృష్ణ అవెన్యూలోని "రత్నం గెస్ట్‌హౌస్"నందు జరుగును.
బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.